**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499

సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు

విజయ **సారథి**

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక

**టీవీ రిపోర్టర్లు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499

A.P VISION TV

యండి. పి.వెంకటేశ్వర్లు

చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | బుధవారం 11-06-2025 | సంపుటి : 11 | సంచిక : 136 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.

# మీ చొరవ అభినందనీయం.. జాతీయ మహిళా కమిషన్‌పై నారా లోకేష్ ప్రశంస

అమరావతి: సాక్షి ఛానల్ డిబేట్‌లో అమరావతి మహిళలను ఉద్దేశించి జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. అమరావతి ని వేశ్యల నగరంగా కృష్ణంరాజు అభివర్ణించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో ఆగ్రహ జ్వాలలు రేకెత్తాయి. సాక్షి ఛానెల్‌పై, జర్నలిస్ట్ కృష్ణంరాజుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ 'మహిళా కమిషన్ చొరవను ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ (ఔజీతీజీ ఒనీఎవబష్ర) అభినందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ ట్వీట్ చేశారు. అమరావతి మహిళలను ఉద్దేశిస్తూ కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై తక్షణమే స్పందించి చర్యలకు ఆదేశించిన జాతీయ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ విజయ రహత్కర్‌కు అభినందనలు. అమరావతి మహిళా రైతులను వేశ్యలుగా అభివర్ణించడం సిగ్గుచేటు మాత్రమే కాదు.. నేరం కూడా. ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సత్వరమే స్పందించి వేగంగా చర్య తీసుకోవడం ద్వారా అలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించేది లేదనే బలమైన సందేశం ఇచ్చింది. మేమంతా అమరావతి మహిళా రైతుల వెనుక ఉన్నాం. వారికి సత్వరమే న్యాయం జరగాలి' అని నారా లోకేష్ ట్వీట్ చేశారు.



# అనంతపురం జిల్లా ఘటనపై చంద్రబాబు సీరియస్..

అమరావతి, జూన్ 10: ఆడబిడ్డలపై చేయి వేయాలంటే భయపడే పరిస్థితిని రాష్ట్రంలో తీసుకురావాలని పోలీస్ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రామగిరి మండలంలో ఎనిమిదో తరగతి బాలికపై సామూహిక లైంగిక దాడి ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ ఘటనలో నిందితులను వెంటనే అరెస్ట్ చేసి.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం అమరావతిలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చోటు చేసుకున్న ఘటనలపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఒక యువతి హత్య, మరో బాలికపై సామూహిక అత్యాచారం కేసును వేగంగా విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పక్కా ఆధారాల సేకరణతో నిర్దిష్ట సమయంలో నిందితులకు శిక్ష పడేలా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నానన్నారు. గంజాయి బ్యాచ్ ఆట కట్టించాలని స్పష్టం చేశారు. ఇక ఈ రెండు ఘటనల్లో దర్యాప్తు, చర్యల వివరాలను సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా డీజీపీ, ఉన్నతాధికారులు వివరించారు.ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రామగిరి మండలంలో ఎనిమిదో తరగతి చదువుతోన్న దళిత బాలికపై గత రెండేళ్లుగా అత్యాచారం జరుగుతోంది. ఈ ఘటనలో యువకుల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు



ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో ఆరుగురు నిందితులను మంగళవారం అచ్చంపల్లి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నారు. వారిని సైతం అరెస్ట్ చేస్తామని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న వెల్లడించారు. బాధితురాలని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించామన్నారు. అలాగే బాధితురాలికి పూర్తి భద్రత కల్పించామని స్పష్టం చేశారు.

# కలిసికట్టుగా యోగా డేను విజయవంతం చేద్దాం: మంత్రి లోకేష్

విశాఖపట్నం, జూన్ 10: విశాఖ వేదికగా జూన్ 21న జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. యోగా దినోత్సవ వేడుకలపై ఈరోజు (మంగళవారం) మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్‌లోని సాగరిక హాలులో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యోగా డేకు సంబంధించి మంత్రి లోకేష్ పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రపంచం మనవైపు చూసేలా యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించాలన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేసి విజయవంతం చేయాలని లోకేష్ పిలుపునిచ్చారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పక్కా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. సూరత్‌లో జరిగిన ఈవెంట్‌ను స్టడీ చేసి.. పటిష్ట చర్యలు చేపట్టాలని తెలిపారు.ఇదొక చారిత్రక కార్యక్రమమని.. కమిట్‌మెంట్‌తో ప్రతీ ఒక్కరూ పని చేయాలన్నారు. బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి హితవు పలికారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం కాదని... ప్రజల వేడుక, అందరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యమై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలన్నారు. ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యానికి సంబంధించిన క్రతువు ఇది అని చెప్పుకొచ్చారు. ప్రజలు 600 మీటర్ల కన్నా ఎక్కువ దూరం నడవకూడదని.. ఆ మేరకు వాహన సదుపాయం కల్పించాలని అన్నారు. జియో, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ కెపాసిటీ పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించాలని.. ప్రణాళికాయుతంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశాలు చేశారు.ఇక.. ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా నెలరోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా



యోగాంధ్ర 2025 మాసోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీరోజు ప్రజలు యోగాసానాలు చేస్తున్నారు. యోగాంధ్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ యోగాసనాలు వేస్తున్నారు. యోగాను ప్రోత్సహించేందుకు విజయవాడలోని బీఆర్టీఎస్ రోడ్‌ను యోగా రోడ్‌గా మార్చేశారు. అక్కడ ప్రతీ రోజు యోగా నిర్వహించేందుకు వీలు కల్పించింది సర్కార్. ఇక రాజకీయ నాయకులు, పోలీసులు, అధికారులు, యువత, చిన్నారులు, వృద్ధులు అందరూ కూడా యోగాంధ్రలో భాగంగా యోగాసాలు వేస్తున్నారు. జూన్ 21న విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు.

# సజ్జల దూషణలపై అభ్యంతరం.. డీజీపీకి రఘురామ లేఖ

అమరావతి, జూన్ 10: ఏపీ మహిళలను కించ పరిచే వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ) డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు లేఖ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. మహిళలను సంకర జాతి అంటూ సజ్జల దూషణలను రఘురామ తీవ్రంగా తప్పుబట్టారు. కుల వివక్షకు సంబంధించిన ఈ పదం వాడటంపై భారత శిక్షాస్మృతి ప్రకారం చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సజ్జల దూషణలు అమరావతిలో నివసిస్తున్న వేలాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని తెలిపారు.సజ్జల రామకృష్ణ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని డీజీపీకి ఉవనభావతి లేఖ రాశారు. భవిష్యత్తులో ఇటువంటి అవమానకరమైన కులతత్వ భాషను ఎవరూ ఉపయోగించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తూ సజ్జల వ్యాఖ్యలను డిప్యూటీ స్పీకర్ రఘురామ తన లేఖకు జత చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ.. సజ్జల రామకృష్ణరెడ్డి దెయ్యాలు వేదాలు వల్లించినట్టు కొన్ని వేదమంత్రాలు వల్లించారని మండిపడ్డారు. అమరావతిలో మహిళలను వేశ్యలుగా అవమానించిన వ్యక్తుల ఫోటోలను చెప్పుతో కొట్టాలన్నారు. గత ప్రభుత్వం చేస్తున్న ఆగడాలను తాను ప్రశ్నించినందుకు నర్సాపురం పార్లమెంటులో అన్ని గ్రామాల్లో తన ఫోటోలను చెప్పులతో కొట్టించారని గుర్తుచేశారు. వాళ్ళకు వాళు ్ళ రాక్షసులు, పిశాచాలు అనుకుంటే వారి ఇష్టమన్నారు. 'వాళ్ళంతా పిశాచాలు, రాక్షసులు, సంకర జాతి వాళ్ళు అని నేను పోరపాటున కూడా అనడం లేదు. నా దిష్టి బొమ్మలు తగులబెట్టారు. మూత్రం కూడా పోశారు. చెప్పుకోవాలంటే బాధ అనిపిస్తుంది. ఇవి సోషల్ మీడియాలో పెట్టి చాలా ఆనందించారు. ఇది రాక్షస ఆనందం అంటారో, పిశాచ ఆనందం అంటారో.



# చెల్లినే వదలలేదు.. మహిళలకు ఏం గౌరవం ఇస్తారు: షర్మిల

అమరావతి, జూన్ 10: ఏపీ మహిళలను ఉద్దేశించి వైసీపీ నేత సజ్జల రామకృష్ణా రెడ్డి చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. సజ్జల వ్యాఖ్యలను ప్రతీ ఒక్కరూ ఖండిస్తున్నారు. తాజాగా వైసీపీ నేత చేసిన కామెంట్స్‌పై ఏపీపీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి స్పందిస్తూ.. మహిళల మీద సజ్జల రామకృష్ణా రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మూర్ఖుడిలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహిళలను పిశాచులతో పోల్చుతారా.. మహిళలను రాక్షసులు అంటారా అంటూ ఫైర్ అయ్యారు. సంకర జాతి అని మహిళలను అవమానిస్తారా అని అన్నారు.చేసిన తప్పుకి క్షమాపణ చెప్పడానికి ఎందుకు నామోషీ అని ప్రశ్నించారు. వైసీపీ చేసిన తప్పును మళ్ళీ మళ్ళీ చేస్తోందన్నారు. ఇదే సజ్జల కొడుకు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని తనను కూడా వదిలి పెట్టలేదన్నారు. సైతాన్ సైన్యంతో తన మీద తప్పుడు ప్రచారం చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ బిడ్డ అని, ఒక మహిళా అని చూడకుండా కించపరిచారన్నారు. జగన్ నా అక్క చెల్లెళ్ళు అంటారని.. కానీ జగన్ సొంత చెల్లికే మర్యాద లేదని.. ఇక రాష్ట్రంలో వీళ్ళు మహిళలకు ఏం గౌరవం ఇస్తారు అంటూ ఎద్దేవా చేశారు.



# రెండు రోజులు పాటు భారీ వర్షాలు

అమరావతి, జూన్ 10: వాయువ్య ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు ఉత్తర మధ్యప్రదేశ్, దక్షిణ ఛత్తీస్‌గఢ్.. మధ్య ఒడిశా మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ వెల్లడించింది. ఈ ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని పేర్కొంది. ప్రజలు హోర్డింగ్స్, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు వంటి వాటి దగ్గర నిలబడ వద్దని సూచించింది.మరోవైపు కొన్ని ప్రాంతాల్లో ఉక్కపోతతో పాటు ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పింది. ఈ విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. రేపు అంటే.. బుధవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లో 40 నుంచి 41 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందంది.ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది.జూన్ 12, గురువారం:నెల్లూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లో కొన్నిప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.ల్లూరి సీతారామరాజు, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అకాశం ఉంది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.జూన్ 13, శుక్రవారం:తూర్పుగోదావరి, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశంఉంది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.మంగళవారం సాయంత్రం 5 గంటల నాటికి మన్యం జిల్లా సాలూరులో 43 మిమీ, శ్రీకాకుళంలో 42.7 మిమీ, విశాఖ జిల్లా ఆనందపురంలో 37.5 మిమీ వర్షపాతం రికార్డు అయింది.



# ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే సంచలన లేఖ



ఢిల్లీ: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఏ ఐ సీ సీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీపై ప్రధానికి లేఖ రాశారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ నియామకం ఆలస్యమవుతుండటంపై లేఖలో ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక తప్పనిసరి అని తెలిపారు మల్లికార్జున ఖర్గే.స్పీకర్ తర్వాత లోక్‌సభలో రెండో అత్యున్నత స్థానం డిప్యూటీ స్పీకర్‌దేనని మల్లికార్జున ఖర్గే గుర్తుచేశారు. ప్రతి కొత్త లోక్‌సభ రెండో లేక మూడో సెషన్‌లో డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవడం సంప్రదాయమని ఉద్ఘాటించారు. మొదటి నుంచి పదహారో లోక్‌సభ వరకు అన్ని లోక్‌సభల్లో డిప్యూటీ స్పీకర్ ఉన్నారని వివరించారు. కానీ 17వ, 18వ లోక్‌సభల్లో ఆ పదవి ఖాళీగా ఉందని చెప్పుకొచ్చారు మల్లికార్జున ఖర్గే.ఇది ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడం సంప్రదాయమని చెప్పారు. ఈ స్థానం ఖాళీగా ఉండటం రాజ్యాంగ ఉల్లంఘన అని తెలిపారు. వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభించాలంటూ ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే విజ్ఞప్తి చేశారు.

# సంపాదకీయం

**బుధవారం 11-06-2025**

## కొంపముంచుతున్న ట్రంప్ విధానాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొస్తున్న వలస విధానాలపై స్వదేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గత నాలుగు రోజులుగా లాస్ ఏంజిల్స్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆందోళనలు మరింత ఉద్ధృతమవుతోన్న నేపథ్యంలో మరిన్న బలగాలను పంపాలని ట్రంప్ ఆదేశించారు. సుమారు 700 మెరీన్లను తాత్కాలికంగా లాస్ ఏంజిల్స్‌లో మోహరించాలని ఆయన సూచించారు. అంతేకాదు, 'నిరసనకారులకు తగిన గుణపాఠం ఉంటుంది' అంటూ ఆయన హెచ్చరించారు. డొనాల్డ్ ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో "మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్" నినాదంతో అగ్రరాజ్యానికి పూర్వ వైభవం తెస్తానని హామీ ఇచ్చారు. అయితే, ఆయన అధ్యక్షుడిగా రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలు, ముఖ్యంగా టారిఫ్ ఆంక్షలు, అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఊహించని నష్టాలను కలిగిస్తున్నాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. చైనాతో సహా అనేక దేశాలపై విధించిన భారీ సుంకాలు, కఠిన వీసా నిబంధనలు, ఇతర విధానాలు అమెరికా యొక్క పర్యాటక రంగం, ఉపాధి అవకాశాలు, వ్యాపార విస్తరణను దెబ్బతీస్తున్నాయి.ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, చైనాతో సహా అనేక దేశాలపై భారీ సుంకాలను విధించారు. చైనా ఉత్పత్తులపై ఏకంగా 155% సుంకం విధించాలన్న నిర్ణయం ఆర్థిక ఉద్రిక్తతలను తీవ్రతరం చేసింది. ఈ సుంకాలు అమెరికా ఆర్థిక ప్రయోజనాలను కాపాడతాయని ట్రంప్ భావించినప్పటికీ, ఫలితాలు ఊహించిన దానికి విరుద్ధంగా ఉన్నాయి. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం, ఈ టారిఫ్ విధానాల వల్ల 2025లో అమెరికా పర్యాటక రంగంలో సుమారు 100 బిలియన్ డాలర్ల ఆదాయ నష్టం జరిగే అవకాశం ఉంది. అదనంగా, ఈ ఆంక్షలు అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను దెబ్బతీసి, స్థానిక ఉపాధి అవకాశాలను కూడా తగ్గిస్తున్నాయి.ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న మునుపటి కాలంలో, 2024లో అమెరికా సుమారు 7 కోట్ల మంది పర్యాటకులను ఆకర్షించి, 155 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈ ఆదాయం హోటళ్లు, రిటైల్ దుకాణాలు, రవాణా, ఆహార?పానీయ రంగాలను సమృద్ధిగా ఉంచింది. అయితే, ట్రంప్ కొత్త టారిఫ్ విధానాలు, కఠిన వీసా నిబంధనల కారణంగా 2025లో పర్యాటకుల సంఖ్య 14% తగ్గినట్లు అంచనా వేయబడింది. కెనెడా నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా ఐదవ వంతుకు పడిపోయింది. దీని ఫలితంగా, పర్యాటక రంగంలో ఖర్చు సుమారు 9 బిలియన్ డాలర్లు తగ్గినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి, ఇది హోటళ్లు, రిటైల్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.ట్రంప్ యొక్క టారిఫ్ విధానాలు, ఆర్థిక అనిశ్చితి అమెరికాలో వ్యాపార విస్తరణను ప్రభావితం చేస్తున్నాయి. డెల్టా ఎయిర్‌లైన్స్, బెల్లూస్కూరా వంటి సంస్థలు తమ ఆర్థిక అంచనాలను సవరించుకుంటున్నాయి. బ్రిటన్‌కు చెందిన క్యారెక్టర్ గ్రూప్, మద్యం తయారీ దిగ్గజం డియాగో వంటి కంపెనీలు కెనెడా, మెక్సికోపై విధించిన సుంకాల కారణంగా తమ వ్యాపార ప్రణాళికలను మార్చుకుంటున్నాయి. డియాగో సంస్థ ఒక్కటే సుమారు 2 బిలియన్ డాలర్ల నష్టాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని అంచనా. అదనంగా, ఆపిల్ సీఈవో టిమ్ కుక్ ట్రంప్ హెచ్చరికలను ఖాతరు చేయకుండా, ఐఫోన్ తయారీని భారత్‌లో కొనసాగిస్తున్నారు. జాన్ డీర్ వంటి ట్రాక్టర్ తయారీ సంస్థలు కూడా తమ ఉత్పత్తి రంగాన్ని కెనెడాకు తరలించే ఆలోచనలో ఉన్నాయి. ఈ చర్యలు అమెరికాలో స్థానిక ఉపాధి అవకాశాలను తగ్గిస్తున్నాయి.ట్రంప్ విధానాలు భారతీయ సంతతి అమెరికన్లు, భారతీయ వలసదారులపై కూడా ప్రభావం చూపుతున్నాయి. భారత ఉత్పత్తులపై సుంకాల విషయంలో కొంత ఉపశమనం లభించినప్పటికీ, హెచ్1బీ వీసా నిబంధనల కఠినత, గ్రీన్ కార్డ్ ఉన్నవారిని బహిష్కరించే హెచ్చరికలు, స్వదేశానికి పంపే డబ్బుపై 5% సుంకం వంటి చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నిర్ణయాలు భారతీయ సంతతి వ్యాపారవేత్తలు, ఉద్యోగుల ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. అయినప్పటికీ, భారత్‌లో ఐఫోన్ తయారీ వంటి చర్యలు భారత ఆర్థిక వ్యవస్థకు లాభదాయకంగా ఉన్నాయి.''మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్'' నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్ విధానాలు, ముఖ్యంగా టారిఫ్ ఆంక్షలు, కఠిన వీసా నిబంధనలు అమెరికా ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తున్నాయి. పర్యాటక రంగంలో ఆదాయ నష్టం, ఉపాధి అవకాశాల క్షీణత, కంపెనీల వెనక్కి తగ్గడం వంటి పరిణామాలు ట్రంప్ విధానాల పరిణామాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. భారతీయ సంతతిపై కూడా ఈ చర్యలు గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. భవిష్యత్తులో అమెరికా ఈ విధానాలను సమీక్షించి, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ సంబంధాలను కాపాడుకునే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.లాస్ ఏంజిల్స్ నగరంలోని వలసదారుల నిర్బంధ కేంద్రం వద్ద వందలాది మంది గుమికూడి ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'సిగ్గు! సిగ్గు! సిగ్గు' అంటూ ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. నిరసనలు అదుపుతప్పడంతో పోలీసులు ఫ్లాష్‌బాంబ్‌లు, రబ్బరు బుల్లెట్లను ప్రయోగించి వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయినాసరే ఆందోళనకారులు వెనక్కి తగ్గడం లేదు. ప్రభుత్వ ఆస్తులు, సిబ్బందిని రక్షించేందుకు సైన్యం తాత్కాలికంగా ఒక బెటాలియన్‌ను మోహరించనుంది. ఇప్పటివరకు ట్రంప్ ప్రభుత్వం ఇన్సరెక్షన్ యాక్ట్‌ను అమలు చేయలేదు. ఇది అమలయ్యే దశకు వెళ్లితే, పౌర చట్టాల అమలులో సైన్యం ప్రత్యక్షంగా పాల్గొంటుంది.కాలిఫోర్నియా ప్రభుత్వం ట్రంప్ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ... నేషనల్ గార్డ్, మెరైన్స్ మోహరింపును నిలిపివేయాలని కోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది. రాష్ట్ర అధికారం, ఫెడరల్ చట్టాలకు ఇది విరుద్ధమని రాష్ట్ర అధికారులు వాదిస్తున్నారు.

# ఎట్టకేలకు పదవుల భర్తీ...

హైదరాబాద్, జూన్ 10,)కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణలో పెండింగ్ లిస్ట్‌లపై ఫోకస్ పెట్టింది. ఇప్పటికే మూడు కేబినెట్ బెర్త్‌లు ఫిల్ చేసిన హస్తం పార్టీ.. దాదాపు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల పదవులను కేటాయిస్తూ జాబితా రిలీజ్ చేసింది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుతో పాటు అసంతృప్తులపై కూడా అధిష్ఠానంతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయిన రేవంత్‌రెడ్డి..ఇవాళ ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో పాటు పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో సమాలోచనలు చేయనున్నారు. ప్రభుత్వ పాలన, పథకాల అమలుతో పాటు పార్టీ పరిస్థితులు, సంస్థగత ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై అధిష్టానంతో చర్చలు జరపనున్నారు..తెలంగాణలో మరో కీలక నిర్ణయం తీసుకుంది కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం.. 96 మంది నేతలకు తెలంగాణ కాంగ్రెస్ కమిటీలో కీలక పదవులు అప్పగిస్తూ జాబితా రిలీజ్ చేసింది. ఇటీవల టీపీసీసీలో ఐదు కమిటీలను ప్రకటించిన ఏఐసీసీ.. తాజాగా 27మంది నేతలకు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, 69మందికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా అవకాశం కల్పించింది. కార్యవర్గంలో ఒక ఎంపీతో పాటు ఐదుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలకు అవకాశం కల్పించింది అధిష్ఠానం. టీపీసీసీ ఉపాధ్యక్షులుగా ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణతో పాటు ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బసవరాజు సారయ్యకు స్థానం కల్పించింది. జనరల్ సెక్రెటరీలుగా ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పర్నికారెడ్డి, మట్టా రాగమయికు అవకాశం లభించింది.టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల పదవుల్లో సామాజిక న్యాయానికి, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. 27 మంది ఉపాధ్యక్షులలో బీసీలకు 8, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ముస్లింలకు 3 పదవులు కేటాయించారు. వీటిలో 67 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీలకు ఇచ్చారు. అలాగే 69 ప్రధాన కార్యదర్శి పదవులలో బీసీలకు అత్యధికంగా 26, ఎస్సీలకు 9, ఎస్టీలకు 4, ముస్లింలకు 8 పదవులు ఇచ్చారు. వర్కింగ్ ప్రెసిడెంట్ల లిస్ట్‌పై కూడా త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం కనిపిస్తోంది.ఇక ఇప్పటికే తెలంగాణ కేబినెట్‌లో మూడు బెర్త్‌లను ఫిల్‌చేసిన అధిష్ఠానం వారికి శాఖల కేటాయింపుపై దృష్టిపెట్టింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంతరెడ్డి..నూతన మంత్రులకు శాఖల కేటాయింపు, ఫోర్ట్‌ఫోలియోల మార్పులు, అసంతృప్తులపై చర్చలు జరిపారు. ప్రస్తుతం సీఎం దగ్గర ఉన్న పలు కీలక శాఖలను ఇతర మంత్రులకు కేటాయించే అంశంపై కేసీ వేణుగోపాల్‌తో సుదీర్ఘంగా చర్చించారు రేవంత్‌రెడ్డి. గంటపాటు సాగిన ఈ భేటీలో మంత్రులకు శాఖల కేటాయింపుపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం మంత్రుల దగ్గర ఉన్న శాఖలు, 18 నెలలుగా వారి పనితీరుపై చర్చించినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రుల దగ్గర అదనంగా ఉన్న శాఖల సమాచారాన్ని కేసీ వేణుగోపాల్‌కు అందించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి దగ్గర హోం, ఎడ్యుకేషన్, మున్సిపల్, మైనింగ్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్, కమర్షియల్ ట్యాక్స్, లా, లేబర్, స్పోర్ట్స్, యువజన శాఖలు ఉన్నాయి. వీటిలో కొత్త వారికి పలు శాఖలు అప్పగించడంతో పాటు ప్రస్తుతం ఉన్న మంత్రుల శాఖల్లోనూ మార్పులు చేయాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు తెలిసింది. అదే ఫైనల్ అయితే డిప్యూటీ సీఎం మొదలు కీలక మంత్రుల శాఖల్లోనూ మార్పులు ఉండవచ్చని చెబుతు న్నారు.నూతనంగా మంత్రి బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్‌కు లేబర్, మైనింగ్, స్పోర్ట్స్ శాఖలు ఇవ్వనున్నట్లు పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. అలాగే వాకిటి శ్రీహరికి లా, యూత్,పశుసంవర్ధక శాఖలు లేదా మత్స్యశాఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అప్పగిస్తారని పార్టీలో జోరుగా ప్రచారం సాగుతోంది. వీటితో పాటు మంత్రి పదవి ఆశించి భంగపడిన వారి వివరాలతో పాటు వారిని శాంతింప జేసే అంశాలపై కూడా కేసీతో సీఎం మాట్లాడినట్లు తెలిసింది. అలాగే రాబోయే లోకల్ బాడీ ఎలక్షన్స్‌తో పాటు, కార్పొరేషన్లపై ఫోకస్‌పెట్టాలనిసీఎంకుసూచించినట్లు తెలిసింది. బీఆర్ఎస్‌లో అంతర్గత లొల్లి,బీజేపీ–బీఆర్ఎస్‌ల మధ్య రహస్య ఒప్పందాలను ఎండగడుతూ ప్రస్తుతం పార్టీని మరింత బలోపేతం చేయాలని సీఎంకు అధిష్ఠానం నిర్దేశించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి

# సింగిల్ డిజిట్ కు భారత్ పేదరికం

న్యూఢిల్లీ జూన్ 10, భారత్, పాకిస్థాన్ మధ్య పేదరిక స్థాయిలలో గణనీయమైన వ్యత్యాసం ఉందని తాజాగా ప్రపంచ బ్యాంకు గ్లోబల్ పావర్టీ డేటా స్పష్టం చేసింది. వరల్డ్ బ్యాంకు డేటా రెండు దేశాల ఆర్థిక ప్రగతి, పాలన వ్యవస్థల ప్రభావం,సామాజిక సంక్షేమ విధానాల ఫలితాలను ప్రతిబింబిస్తున్నాయి. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం.. భారతదేశంలో తీవ్రమైన పేదరిక రేటు2011లో 22.5%గా ఉండగా.. అది 2021 నాటికి 10%కి తగ్గింది.అంతేకాదు, 2024 నాటికి ఈ రేటు సింగిల్ డిజిట్‌కు తగ్గిపోవచ్చని అంచనాలు ఉన్నాయి. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ఆహార రాయితీలు వంటి సంక్షేమ పథకాలు ఈ పురోగతికి దోహదం చేశాయని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం, మహిళల ఆర్థిక భాగస్వామ్యం, డిజిటల్ లావాదేవీల విస్తరణ కూడా పేదరికం తగ్గుదలకు దోహదం చేశాయని తెలిపింది.జనాభాలో ఎంత శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువ నివసిస్తున్నారో నిర్ధారించడానికి ద్రవ్యోల్బణాన్ని దాని ప్రాథమిక సూచికలలో ఒకటిగా వరల్డ్ బ్యాంకుపరిగణనలోకి తీసుకుంది. తన ప్రపంచ ఆదాయ పరిమితిని ఓ వ్యక్తికి రోజుకు 2.15డాలర్లు నుంచి 3 డాలర్లకు సవరించింది. ప్రపంచ బ్యాంకు పేదరికం, భాగస్వామ్య శ్రేయస్సు నివేదిక ప్రకారం.. 2012- 2022 మధ్య, ప్రతి వ్యక్తి ఆదాయంలో పెరుగుదల సవరణ ఉన్నప్పటికీ, భారతదేశంలో తీవ్ర పేదరికం మొత్తం జనాభాలో 27.1 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గింది.భారత్‌లో 2022-23 నాటికి 75.24 మిలియన్ల మంది ప్రజలు తీవ్ర పేదరికంలో జీవిస్తున్నారని, ఇది 2011-12లో 344.47 మిలియన్లతో పోల్చితే భారీ తగ్గుదల అని నివేదిక పేర్కొంది. కేవలం 11 ఏళ్లలో పాకిస్థాన్ మొత్తం జనాభా కంటే ఎక్కువ మంది భారతదేశంలో తీవ్ర పేదరికం నుంచి బయటపడటం విశేషం.విచారకరంగా పాకిస్థాన్ విషయానికొస్తే కథ దీనికి విరుద్ధంగా ఉంది. 2017- 2021 మధ్య 5 ఏళ్లలో తీవ్ర పేదరికం 4.9 శాతం నుంచి 16.5 శాతానికి పెరిగింది. పాక్ గృహ ఆదాయం, వ్యయ సర్వే కారణంగా పరిస్థితి చాలా దారుణంగా ఉండొచ్చని విశ్లేషకులు సూచిస్తున్నారు.పాకిస్థాన్‌లో ఆర్థిక సంక్షోభం, పేదరికం మరింత తీవ్రమవుతుండటం గమనార్హం. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం.. పాకిస్థాన్‌లో పేదరిక రేటు 2018లో 34.2%గా ఉండగా.. 2023 నాటికి అది 39.4%కి పెరిగింది. గత ఐదేళ్లుగా పాక్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ద్రవ్యోల్బణం, ఐఎంఎఫ్ రుణాలపై ఆధారపడటం, ఆ దేశ కరెన్సీ విలువ పతనం, పాలనా అస్థిరత ప్రధాన కారణాలు. ముఖ్యంగా నిత్యావసర, ఇంధన ధరల పెరుగుదల, ఉద్యోగ అవకాశాల కొరత దాయాది దేశంలో పేదరికాన్ని తీవ్రతరం చేస్తున్నాయి.ఆయుధ సామాగ్రి వ్యయాలు, ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు నిధుల వినియోగం, సామాజిక పథకాలకు తక్కువ కేటాయింపులు ఇవన్నీ పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయని నివేదిక తెలిపింది.వాస్తవంగా చూస్తే, వేగంగా పేదరికాన్ని తగ్గిస్తోన్న అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఒకటిగా నిలుస్తోంది. మరోవైపు, పాకిస్థాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కోల్పోయి, అంతర్గత రాజకీయ అస్థిరత వల్ల సామాజిక రంగాల్లో వెనుకడుగు వేస్తోంది.ప్రస్తుతం పాక్ పేదరికం నుంచి బయటపడాలంటే రాజకీయ స్థిరత్వం,ప్రజాపాలనలో పారదర్శకత, వ్యవస్థాపిత సంక్షేమ విధానాలు, విద్య, ఆరోగ్య రంగాల్లో మరింత పెట్టుబడి అవసరమని ప్రపంచ బ్యాంకు నివేదిక స్పష్టం చేసింది.

# రాణా గుట్టు విప్పేస్తాడా...

ముంబై, జూన్ 10,2008 ముంబై దాడులతో సంబంధం ఉన్న ఈ కేసులో రాణా ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడుతున్నాడు. అతను ఇప్పుడు అమెరికాలో అదుపులో ఉన్నాడు. అతని నుంచి రాబోయే సమాచారం ఎన్నో రహస్యాలను వెలికితీసే అవకాశం ఉంది.తహవ్వుర్ రాణా, ఒక కీలక వ్యక్తిగా అంతర్జాతీయ ఉగ్రవాద కేసులలో తన పేరును నమోదు చేసుకున్న వ్యక్తి. 2008 ముంబై దాడులతో సంబంధం ఉన్న ఈ కేసులో రాణా ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడుతున్నాడు. అతను ఇప్పుడు అమెరికాలో అదుపులో ఉన్నాడు. అతని నుంచి రాబోయే సమాచారం ఎన్నో రహస్యాలను వెలికితీసే అవకాశం ఉంది.తహవ్వుర్ హుస్సేన్ రాణా, ఒక కెనడియన్ వ్యాపారవేత్త, ముంబై దాడులకు సంబంధించిన ఆరోపణలలో ప్రధాన వ్యక్తిగా చర్చించబడుతున్నాడు. అతను డేవిడ్ కోల్‌మాన్ హెడ్లీతో కలిసి లష్కర్?ఏ?తోయిబాకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. రాణా తన ఇమ్మిగ్రేషన్ సంస్థ ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలకు సహాయం అందించినట్లు అమెరికా అధికారులు భావిస్తున్నారు. 2008లో జరిగిన ముంబై ఉగ్రదాడులు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఈ దాడులలో రాణా ఒక ముఖ్యమైన మధ్యవర్తిగా పనిచేసినట్లు ఆధారాలు సూచిస్తున్నాయి. హెడ్లీతో కలిసి, రాణా దాడులకు సంబంధించిన ప్రణాళికలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అతను హెడ్లీకి ఆర్థిక మరియు లాజిస్టిక్ సహాయం అందించినట్లు నివేదికలు తెలిపాయి.రాణా 2009లో అమెరికాలో అరెస్టయ్యాడు. అతనిపై ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన ఆరోపణలు నమోదయ్యాయి. అతని విచారణ ప్రక్రియలో అనేక మలుపులు తిరిగాయి. రాణా విచారణలో సహకరిస్తే, అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌ల గురించి కీలక సమాచారం బయటకు రావచ్చు. లష్కర్?ఏ?తోయిబా, ఇతర ఉగ్రవాద సంస్థలతో అతని సంబంధాలు, మరియు వారి ఆర్థిక వనరుల గురించి సమాచారం అందించే అవకాశం ఉంది. . అయితే, రాణా సహకరిస్తాడా లేదా అనేది ఇంకా అనిశ్చితంగా ఉంది.తహవ్వుర్ రాణా కేసు అంతర్జాతీయ ఉగ్రవాద యుద్ధంలో ఒక కీలక అధ్యాయం. అతను బయటపెట్టగల సమాచారం ఉగ్రవాద నెట్‌వర్క్‌లను ఛేదించడంలో సహాయపడవచ్చు. రాణా కేసు పురోగతిని ప్రపంచవ్యాప్తంగా భద్రతా నిపుణులు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ కేసు భవిష్యత్తులో ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి.

# రియల్ ఆఫర్లను పట్టించుకోని జనాలు

హైదరాబాద్, జూన్ 10, తెలంగాణలో రియల్ ఎస్టేట్ వ్యాపారం స్దబ్దుగా ఉన్నట్లు కనపడుతుంది. అనేక అధ్యయనాలు ఇవే చెబుతున్నాయి. అనేక కారణాలు రియల్ రంగంలో స్తబ్దతకు కారణాలుగా చెబుతున్నారు. గతంలో ఫ్లాట్లు, ప్లాట్లు క్రయ విక్రయాలు జోరుగా జరిగేవి. కానీ కొన్ని రోజుల నుంచి అవి తగ్గుముఖం పట్టాయని రిజిస్ట్రేషన్ శాఖ లెక్కలు చెబుతున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని అంటున్నారు. అదే సమయంలో బిల్డర్లు అనేక ఆఫర్లు ప్రకటిస్తున్నారు. తక్కువ ధరలకే విక్రయిస్తామని చెబుతున్నప్పటికీ కొనుగోలు చేసే వారి సంఖ్య క్రమంగా తగ్గుతుంది. మరీ నెల రోజుల నుంచి అంటే మే నెలలో రియల్ రంగం మరింత దిగజారిపోయిందని రియల్ రంగ నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో పరిణామాలే... ఇందుకు ప్రధాన కారణం అమెరికాలో జరుగుతున్న పరిణామాలు అని చెప్పాలి. ఈ ఏడాది జనవరి నుంచి డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయిన తర్వాత తీసుకున్న నిర్ణయాలతో పాటు ఆయన అనుసరిస్తున్న విధానాలు రియల్ రంగంపై ప్రభావం చూపుతున్నాయంటున్నారు. అమెరికాకు వెళ్లి డాలర్లు సంపాదించి తమ తల్లిదండ్రులకు ఇళ్లు కానీ, ఇంటి స్థలాలను కాని కొనుగోలు చేసి పెట్టేవారు. అవి భవిష్యత్ లో తమకు స్థిరాస్థిగా ఉంటుందని ఆశపడేవారు. కానీ గత కొన్ని రోజుల నుంచి డాలర్ డ్రీమ్స్ కరిగిపోతుంది. చదువుకుంటూ పార్ట్ టైం జాబ్ చేయడం పై నిషేధం విధించిన ట్రంప్ అమెరికా ఫస్ట్ అనే నినాదాన్ని అందుకోవడంతో అక్కడ ఉద్యోగాలకు కూడా భద్రత లేకుండా పోయింది దీంతో రియల్ రంగంపై పెట్టుబడి పెట్టే వారు చాలా వరకూ తగ్గారని చెబుతున్నారు. హైదరాబాద్ చుట్టు పక్కల అనేక వెంచర్లుభారీగా వెలిశాయి. కమ్యునిటీ అపార్ట్ మెంట్లను ముందుగానే నిర్మించి రెడీ టు ఆక్యుపై అన్న నినాదంతో బిల్డర్లు రియల్ రంగానికి ఊపు తెద్దామని భావించారు. హైడ్రా కూల్చివేతలతో కొంత తగ్గినప్పటికీ అన్ని అనుమతులను న్యాయవాదులతో పరిశీలించిన తర్వాత కొనుగోలు చేసేవారు. కానీ మే నెల నుంచి మాత్రం తక్కువ ధరకు ఇస్తామన్న అపార్ట్ మెంట్ లో ఫ్లాట్లు కొనేవారు లేకుండా పోయారని, చదరపు గజంపై వెయ్యి నుంచి రెండు వేల రూపాయలు తగ్గించినా కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదని రియల్ వ్యాపారులు చెబుతున్నారు. ఇక్కడ ఉన్న సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కూడా తమ ఉద్యోగంలో భద్రత లేని కారణంగా హౌసింగ్ పై పెట్టుబడి పెట్టేకన్నా, వేరే ప్రత్యామ్నాయం వైపు చూస్తుండటంతో రియల్ రంగం నేల చూపులు చూస్తుంది.

### పాఠశాల ప్రహరీ కోసం దేశం కార్యకర్త మౌన పోరాటం

మండపేట జూన్ 10, విద్యార్థుల క్షేమం కోసం మండలంలోని కేశవరంకు చెందిన సామాజిక కార్యకర్త, టీడీపీ కార్యకర్త వల్లూరి శ్రీవాణి గత 53 రోజులుగా మౌన దీక్ష చేపట్టి శాంతియుతంగా పోరాటం కొనసాగిస్తున్నారు. తన వ్యక్తిగత ప్రయోజనం కోసం కాకుండా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం కావాలన్నదే ఆమె ప్రధాన లక్ష్యంతో పోరాటానికి దిగారు. ఉదయం స్కూల్ మొదలయ్యే సమయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు, స్కూల్ గేటు వద్ద చాప వేసుకొని ఒంటరిగా కూర్చుని శ్రీవాణి దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నిరసన చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. విద్యార్థులే కాదు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా ఆమె దీక్షకు మద్దతు తెలుపుతున్నారు. 60 ఏళ్ల చరిత్ర కలిగిన ఆ పాఠశాలకు ఇప్పటికీ ప్రహరీ లేకపోవడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గ్రామానికి అనేక హామీలు ఇచ్చినా, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అవన్నీ మరిచిపోయారని ఆరోపించారు. తాను టీడీపీ కార్యకర్తగా చాలా సంవత్సరాలుగా సేవలందిస్తున్నానని తెలిపారు. అమరావతి రైతుల కోసం 200 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు అరెస్టు అయినప్పుడు అన్నవరం వరకు పాదయాత్ర చేసిన ఏకైక మహిళ తానేనని చెప్పారు. తాను పార్టీ పరంగా ఉన్నా, గ్రామాభివృద్ధి కోసం పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. 53 రోజులుగా దీక్ష చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే గానీ, అధికారులు గానీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. దీంతో విద్యార్థులు, గ్రామస్తులు అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం జరిగే వరకు తన పోరాటం ఆగదని శ్రీవాణి స్పష్టం చేశారు.

# మరో 20 రోజులు రేషన్

హైదరాబాద్, జూన్ 10, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పింది. రేషన్ సరుకుల పంపిణీ సమయాన్ని ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగించింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి తెలంగాణలో రేషన్ దుకాణాలలో ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఒకేసారిమూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని అందించాలని నిర్ణయం తీసుకుంది. రానున్న మూడు నెలలు ప్రకృతి వైపరీత్యాలు వచ్చే అవకాశమున్నందున మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి అందించాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలతో ఒక్కొక్క రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యుడికి పద్దెనిమిది కేజీల బియ్యాన్ని అందిస్తుంది. కుటుంబంలో ఎంత మంది ఉన్నప్పటికీ అన్నిపద్దెనిమిది కేజీల బియ్యాన్ని ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఒకేసారి రేషన్ బియ్యం ఇస్తుండటంతో రేషన్ దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకూ క్యూ లైన్ లతో పడిగాపులు పడుతున్నారు. అనేక మంది జాగారం చేయాల్సి వస్తుంది. తీరా తమ వంతుకు వచ్చేసరికి స్టాక్ అయిపోతుండటంతో నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అందుకే ఈ నెల 30వ తేదీ వరకూ రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయని, అందరికి పంపిణీ చేయడానికి సరిపడా స్టాక్ రేషన్ దుకాణాల వద్ద ఉందని ప్రభుత్వం ప్రకటించింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రేషన్ కార్డులున్న వారందరికీ మూడు నెలలకు సరిపడా సన్న బియ్యాన్ని అందచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపింది. హరీశ్ రావు గడువు పెంచడంతో... రేషన్ సరుకులను ఇచ్చే గడువును పెంచిన కారణంగా కొంత రద్దీ తగ్గుతుందని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మొత్తం 90 లక్షలకు పైగా రేషన్ కార్డులున్నాయి. అందులో మూడుకోట్ల మందికి సన్నబియ్యాన్ని తెలంగాణ ప్రభుత్వం అందిస్తుంది. ప్రతినెల రేషన్ దుకాణాలకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తుంది. ఎక్కడా బియ్యం కొరత అంటూ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

# సీనియర్లకు భయపడుతున్నారా

హైదరాబాద్, జూన్ 10, ప్రభుత్వం సమర్థంగా నడవాలంటే వ్యవస్థల్లో సమర్థులైన వారు ఉండాలి. ముఖ్యంగా మంత్రివర్గం పూర్తి స్థాయిలో ఉండటంతో పాటు వారంతా యాక్టివ్‌గా ఉండేలా చూసుకోవాల్సి ఉంది. లేకపోతే పాలనపై ప్రభావం పడుతుంది. పూర్తి స్థాయి మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకోకపోతే రాజకీయంగానూ విమర్శలు వస్తాయి. ముఖ్యమంత్రిగా పట్టు లేదని.. అందుకే మంత్రి పదవుల్నీ ఇవ్వలేకపోతున్నారని అంటారు. ఇప్పుడు ఇలాంటి పరిస్థితి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎదురవుతోంది. తెలంగాణ కేబినెట్‌లో మొత్తం పద్దెనిమిది మంది మంత్రులకు అవకాశం ఉంటుంది. వీరిలో పన్నెండు మంది మాత్రం ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఏడాదిన్నర కిందట ప్రమాణ స్వీకారం చేశారు. మరో ఆరు స్థానాలను ఖాళీగా ఉంచారు. వాటిని చూపించి ఎంపీ ఎన్నికల్లో ఆశావహుల్ని పరుగులు పెట్టించాలని అనుకున్నారు. అనుకున్నట్లుగా పెట్టించారు. కానీ ఫలితం ఎనిమిది సీట్ల వద్దనే ఆగిపోయింది. ఈ ఎఫెక్ట్ తో పాటు.. మంత్రి పదవుల రేసు తీవ్రంగా ఉండటంతో ఇప్పటి వరకూ భర్తీ చేయలేకపోయారు. రెడ్డి సామాజికవర్గంలో పోటీ ఊహించనంతగా ఉంది. ఎవరికి ఇచ్చినా మరొకరు తిరుగుబాటు చేస్తారన్న భయంతో మూడు పదవుల్ని ఖాళీగా ఉంచి మూడింటిని మాత్రమే భర్తీ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత పూర్తి స్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం సీఎం ప్రధాన విధి. అ?యతే ఇప్పటి వరకూ హోం, హోంశాఖ వంటి ప్రధాన శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దనే ఉన్నాయి. పేరుకు ముఖ్యమంత్రి చూస్తారు కానీ ఆయనకు అంత తీరిక ఉండదు. మంత్రుల్లేని శాఖలన్నమాట. అలాంటి కీలకమైన శాఖలకూ మంత్రులు లేకపోవడం సీఎం విధి నిర్వహణలో సమస్యలు తెచ్చి పెడుతుంది. అందుకే పూర్తి స్థాయిలో మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకోలేకపోవడం సీఎం వైఫల్యమేనంటున్నారు. పొరుగున ఉన్న కర్ణాటకలో పరిస్థితులు ఎలా ఉన్నా.. మొత్తం మంత్రి వర్గాన్ని సిద్ధరామయ్య ఏర్పాటు చేసుకున్నారని కొంత మంది గుర్తు చేస్తున్నారు.మంత్రి పదవుల కోసం పోటీ అనేది సహజంగానే ఉంటుంది. కేబినెట్ మంత్రులపై కసరత్తు జరిగినప్పుడు కేవలం ఒక్కటి మాత్రమే ఖాళీగా ఉంచి ఐదు పదవుల్ని భర్తీ చేయాలనుకున్నారని.. వివాదాస్పదమైన ఒకరిద్దరు మంత్రుల్ని తప్పించి.. కొత్త వారికి చాన్సివ్వాలనుకున్నారన్న ప్రచారం జరిగింది. కానీ అలాంటి పరిస్థితులు కనిపించలేదు. తీవ్రంగా మంత్రి పదవుల కోసం పోటీ పడుతున్న వారికి చాన్స్ దక్కలేదు. అదే సమయంలో ఉమ్మడి జిల్లాల్లో కొన్ని జిల్లాలకు మూడు పదవులు దక్కాయి కానీ.. గ్రేటర్, నిజామాబాద్ వంటి ప్రాంతాలకు ఒక్క పదవి కూడా లేదు. ఇలా సమీకరణాలను చూసుకోలేకపోవడం.. పూర్తి స్థాయిలో మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకోలేకపోవడం రేవంత్ రెడ్డికి సమస్యగా మారింది. ఆయన పాలనపై , పార్టీపై, ప్రభుత్వంప పట్టు సాధించలేదనడానికి నిదర్శనమని అంటున్నారు.కలిసొచ్చిన సామాజిక వర్గాలుతొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిని తెలంగాణ మంత్రి పదవులు వరించాయి. సామాజిక సమీకరణాలు, ఆయా ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఇలా అనే విషయాలు పరిశీలించిన కాంగ్రెస్ అధిష్టానం కొత్తగా ముగ్గురికి తెలంగాణ క్యాబినెట్లో చోటు కల్పించింది. తాజాగా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సర్పంచ్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఎమ్మెల్యే అయి.. తొలి ప్రయత్నంలోనే రాష్ట్ర మంత్రి అయ్యారు.తెలంగాణలో 119 నియోజకవర్గాలు, ఒక గవర్నర్ నామినేటెడ్ ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యేతో కలిపి 120 స్థానాలు ఉన్నాయి. రాష్ట్ర కేబినెట్ లో మొత్తం 18 మందికి చోటు కల్పించవచ్చు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సమయంలో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. తాజాగా కేబినెట్ విస్తరణలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరిని మంత్రి పదవి వరించింది. బీసీల్లో మొత్తం 7 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండగా, అత్యధిక జనాభా, ప్రాబల్యం ఉన్న సామాజికవర్గం కావడంలో ముదిరాజ్ ముద్దుబిడ్డ వాకిటి శ్రీహరి తెలంగాణ కేబినెట్ బెర్త్ఆందోళనలకు దిగుతున్న సీనియర్లుభోధన్ శాసనసభ్యుడిగా ఉన్న సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మిన బంటుగా ఉన్నారు. సుదర్శన్ రెడ్డిని మంత్రిని చేయడానికి రేవంత్ రెడ్డి అనేక సందర్భాలలో హస్తిన వెళ్లిపోయారు. గట్టిగా సిఫారసు కూడా చేశారు. అయినప్పటికీ అధిష్టానం రేవంత్ రెడ్డి మాట పట్టించుకోనట్టు తెలుస్తోంది. సుదర్శన్ రెడ్డిని పక్కనపెట్టి.. సామాజిక సమతూకంతో బీసీ, ఎస్సీ లకు మంత్రి పదవులు ఇవ్వాలని నిర్ణయించి.. దానిని అమలులో పెట్టినట్టు తెలుస్తోంది. వాస్తవంగా ఈ పరిణామం సుదర్శన్ రెడ్డి ఇలాంటి వారికి మింగుడు పడడం లేదని ఆయన వర్గీయులు అంటున్నారు. అందువల్లే మంగళవారం బోధన్ బందుకు వారు పిలుపునిచ్చారు. అయితే ఈ బంద్ ఎంతవరకు సక్సెస్ అవుతుందనేది చూడాలి. మరోవైపు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి అనేక సందర్భాలలో మంత్రి పదవులు ఆశించి భంగపడిన సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి వారితో చర్చలు జరిపారు. భవిష్యత్తులో జరిగే విస్తరణలో ప్రాధాన్యం కల్పిస్తామని మాట ఇచ్చారు. ఆ సమయంలో వారు మీనాక్షి మాట విన్నప్పటికీ.. ఆ తర్వాత మళ్లీ అలకపాన్పు ఎక్కారు.ఇక మల్ రెడ్డి మంత్రి పదవి రాకపోవడంతో కీలక వ్యాఖ్యలు చేశారు.. క్షేత్రస్థాయిలో పార్టీకి పట్టు తగ్గిపోతోందని.. వాస్తవంగా ఏం జరుగుతుందో తెలుసుకునే బాధ్యతను అధిష్టానం చేయలేకపోతుందని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు. ఒక రకంగా రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టిస్తున్నాయి.. అయితే ఆయన వేరే దారి చూసుకుంటారా? లేక మలి దశ విస్తరణలో మంత్రి పదవి దక్కించుకుంటారా అనేది చూడాల్సి ఉంది.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా అధిష్టానం పై ఆగ్రహంగా ఉన్నారు. మంత్రి పదవి వస్తుందని ఆయన గట్టి నమ్మకంతో ఉన్నారు. ఢిల్లీ పెద్దలతో కూడా సంప్రదింపులు జరిపారు. శుభవార్త వస్తుంది అనుకుంటున్న తరుణంలో ఊహించని విధంగా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. దీంతో అధిష్టానం పై ఆయన ఒక రకమైన అసంతృప్తి భావనతో ఉన్నారు. తనను అధిష్టానం మంత్రి పదవికి పరిగణలోకి తీసుకోకపోవడం పట్ల తన అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక మంత్రి పదవులు లభించిన వారు మాత్రం ఆనందంగా ఉన్నారు. తమ అనుచరులతో సంబరాలు జరుపుకుంటున్నారు.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు

## ఇందిరా పాడి రైతు పథకం

ఖమ్మం, జూన్ 10,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచితంగా బస్సు పథకం అమలు చేసిన దగ్గర నుంచే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి కూడా పంపిణీ, అలాగే రైతులకు రైతు భరోసా పథకం, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటివరకు పలు విప్లవాత్మక చర్యలకు శ్రీకారం చుట్టింది. రైతు భరోసా పథకంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులను రేవంత్ రెడ్డి సర్కార్ ఆదుకుంటుంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద లబ్ధి పొందుతున్న వారికి త్వరలో 4 ఎకరాలు అంతకంటే ఎక్కువ భూమి కలిగి ఉన్న రైతుల బ్యాంకు ఖాతాలలో డబ్బు జమ చేయబోతున్నట్లు క్లారిటీ ఇచ్చింది. తాజాగా రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రంలో ఉన్న పాడి రైతులకు కూడా ఒక మంచి గుడ్ న్యూస్ తెలిపింది. పాడి రైతుల కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకంగా ఇందిరా డైరీ పథకం అమలు చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొన్ని కీలక విషయాలు తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఇందిరా డైరీ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రెండు గేదెలు ఫ్రీగా ఇస్తున్నట్లు మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాడి రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఇందిరా డైరీ పథకం కింద రాష్ట్రంలో ఉన్న ప్రతి లబ్ధిదారుడికి కూడా రెండు గేదెలు ఫ్రీగా లభిస్తాయి అని తెలిపారు. వివిధ శాఖల అధికారులతో దీనికి సంబంధించి మంత్రి సమీక్ష నిర్వహించారు.పథకం అమలు చేయడంపై అధికారులతో చర్చించారు. అర్హులైన లబ్ధిదారులు ఇందిరా డైరీ పథకానికి ఎటువంటి నగదు చెల్లించకుండానే వారికి ఫ్రీగా రెండు గేదలు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి క్లారిటీ ఇచ్చారు. ఈ పథకానికి సంబంధించిన కొన్ని విధి విధానాలను కూడా ఆయన ప్రస్తావించారు. అలాగే ఇందిరా డైరీ పథకం వర్తించాలి అంటే వాళ్లకు భూమి ఉండాల్సిన నిబంధన కూడా లేదని స్పష్టంగా తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో గేదలు లేని వారికి ముఖ్యంగా ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు తెలిపారు.

## హైదరాబాద్ లో జీ ప్లస్ 3 అపార్ట్ మెంట్స్

హైదరాబాద్, జూన్ 10,తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రస్తుతం గ్రామాల్లోని పేదలు ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే కొందరు పనులు మె?దలుపెట్టగా.. మరికొందరు ఇంటి నిర్మాణానికి రెడీ అవుతున్నారు. ఇక గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి పేదలకు ఇవ్వాలని సర్కార్ నిర్ణయించింది. జీ+3 విధానంలో గృహాల నిర్మాణానికి స్థలాల అన్వేషణను ప్రారంభించింది. ఈ పథకం ద్వారా నిరుపేదలకు సొంత ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 16 మురికివాడల్లో గృహనిర్మాణ శాఖ అధికారులు ఇప్పటికే కొన్ని స్థలాలను గుర్తించారు. వీటిలో ఐఎస్ సదన్ సమీపంలోని సరళాదేవినగర్, దిల్‌సుఖ్‌నగర్‌లోని పిల్లిగుడిసె ప్రాంతాల్లో జీ+3 నిర్మాణాలకు ఎలాంటి సమస్యలు లేవని నిర్ధారించారు. అయితే మిగిలిన 14 ప్రాంతాల్లో మాత్రం వివాదాలు, స్థానికంగా ఇబ్బందులు, కొన్నిచోట్ల కోర్టు కేసులు ఉన్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ, గృహనిర్మాణ, జీహెచ్ఎంసీ అధికారులు కలిసి మరోసారి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ నిబంధనలకు అనుగుణంగా బ్లాకులను నిర్మించడానికి ఈ స్థలాలు సరిపోతాయా అన్నది కూడా ఈ సర్వేలో పరిశీలించనున్నారు.ఎంత పని చేసింది...ఒక్కో బ్లాక్ నిర్మాణానికి కనీసం 500 గజాల స్థలం అవసరమని గృహనిర్మాణ శాఖ అంచనా వేస్తోంది. ఇందులో రోడ్డు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కోసం 150 గజాల స్థలం కేటాయించాలి. ఒక్కో బ్లాక్‌లో 16 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు వీలు ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం 84 వేల ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే గుర్తించిన మురికివాడల్లో పరిమిత స్థలాలు ఉండటంతో, గ్రేటర్ పరిధిలోని మిగిలిన ప్రభుత్వ, మురికివాడల స్థలాలపై కూడా మరో సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వే తర్వాత ఎన్ని ప్రాంతాల్లో జీ+3 బ్లాక్‌లు నిర్మించనున్నారు, మొత్తం ఎన్ని ఫ్లాట్లు అందుబాటులోకి వస్తాయనే దానిపై గృహనిర్మాణ శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది.జిల్లాల్లోని పలు నగరాలు, పట్టణాల్లోనూ మురికివాడల ప్రజలకు జీ+3 విధానంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ తదితర ప్రాంతాల్లోని పేదల బస్తీల్లో ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించి త్వరగా ప్రతిపాదనలు పంపించాలని జిల్లా కలెక్టర్లు, హౌసింగ్ పీడీలను ఉన్నతాధికారులు కోరారు.

## స్కూళ్లలో రేషనలైజేషన్ రచ్చ

మెదక్, జూన్ 10, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసుకోవాలని, ఇది జూన్ 13వ తేదీ లోపు పూర్తి చేయాలని విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులపై ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.బడుల్లో ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఈ ఏడాది ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈ సమయంలో సర్దుబాటు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం కోల్పోతామని చెబుతున్నారు. తక్షణమే ఉత్తర్వులను రద్దు చేయాలని, కనీసం జూన్ 30 వరకు వచ్చిన ప్రవేశాల ఆధారంగా సర్దుబాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. మొదటి ప్రాధాన్యం పంచాయతీ పరిధి, తర్వాత స్కూల్ కాంప్లెక్స్, ఆ తర్వాత మండలం, అనంతరం జిల్లా పరిధిలో సర్దుబాటు చేసుకోవచ్చు. వీటితో పాటు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయాలనే నిబంధనలున్నాయి.పరస్పర బదిలీలకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశమివ్వొద్దు. ఈ ప్రక్రియలో గత యూడైస్ వివరాలను ప్రాతిపదికగా తీసుకోనున్నారు. 10 మందిలోపు విద్యార్థులున్న పాఠశాలకు ఒకరు, 60లోపు ఇద్దరు, 90లోపు ముగ్గురు, 120లోపు నలుగురు, 150వరకు ఐదుగురు, 200లోపు విద్యార్థులుంటే ఆరుగురు ఉపాధ్యాయులుండాలని, 200 దాటిన తర్వాత ప్రతి 40మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ప్రవేశాలు పెంచేందుకు కసరత్తు...ఈ ఏడాది బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. తమ కృషితో ప్రవేశాలు చాలవరకు పెరుగుతాయని ఆశాభావంతో ఉన్నారు. పలు గ్రామాల్లో పిల్లలను ప్రైవేటు బడులకు పంపబోమని తీర్మానాలు సైతం చేయించారు. విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం 60 మంది విద్యా ర్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులు సరిపోతారు. ఇది ఆచరణలో అసాధ్యమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒకటి నుంచి ఐదోతరగతి వరకు మొత్తం 18 సబ్జెక్టులను ఇద్దరు ఎలా బోధిస్తారని, విద్యార్థులకు న్యాయం ఎలా జరుగుతుందని ఉపాధ్యాయవర్గాలు వాదిస్తున్నాయి. బోధనతో పాటు అనేక రిపోర్టులు, నివేదికలు సిద్ధం చేయాల్సి ఉంటుందని, వాటికే ఒకరు సరిపోతున్నారని చెబుతున్నారు.విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో పదోన్నతులు, బదిలీలు, నూతన డీఎస్సీతో పాటు 2008 అభ్యర్థులను తాత్కాలిక ప్రాతి పదికన తీసుకోవడంతో సర్దుబాటు ఆవశ్యకత అంతగా లేకపోవచ్చనే వాదన ఉంది.సర్దుబాటు ప్రక్రియ వాయిదా వేయాలి...సుంకరి కృష్ణ, పీఆర్టీయూ మెదక్ జిల్లాఅధ్యక్షుడుప్రభుత్వం ఇచ్చిన సర్దుబాటు ఉత్తర్వులు జూన్ నెలాఖరు వరకు వాయిదా వేయాలి. వేసవి సెలవుల్లో జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాం. ఫలితంగా ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.జూన్ 18 వరకు బడిబాటలో నూతన ప్రవేశాలు ఎక్కువగా ఉంటాయని భావిస్తున్నాం. జూన్ చివరి వరకు ఎన్రోల్మెంట్ ఆధారంగా చేసుకుని సర్దుబాటు ప్రక్రియ చేపడితే ఫలితం ఉంటుంది.సర్దుబాటు చేస్తాం...ప్రభుత్వం ఇచ్చిన సర్దుబాటు ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. అయితే ఉపాధ్యాయ సంఘాల నుండి విజ్ఞప్తులు వస్తున్న నేపథ్యంలో బడిబాట కార్యక్రమం పూర్తవగానే విద్యార్థుల సంఖ్యను బట్టి సర్దుబాటు చేస్తాం. విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఈనెలాఖరు వరకు విద్యార్థుల సంఖ్యను బట్టి సర్దుబాటు చేసే అవకాశం ఉంది.

## బోనాల ఉత్సవాలపై సమీక్షా సమావేశం

హైదరాబాద్,హైదరాబాద్ లో ఆషాడం లో జరిగే బోనాల ఉత్సవాలపై అధికారుల సమీక్ష జరిగింది. తెలంగాణ ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆషాఢ జాతర బోనాల ఉత్సవాలు 2025 జరగనున్నాయి. ఈ అధికారుల సమన్వయ సమావేశానికి హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, డిజిపి జితెందర్, సిపిసివి ఆనంద్, మంత్రి కొండా సురేఖ, , ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, ఎండోన్మెంట్, మూడు కమిషనరెట్ల సీపీ లు, డీసీపీ లు, పోలీస్ , ఎండోన్మెంట్ అన్ని విభాగాల అధికారులు హజరయ్యారు. ఈ ఈ నెల 26 నుంచి నెల రోజుల పాటు బోనాల ఉత్సవాలు జరగనున్నాయి. గోల్కొండ బోనాలు ప్రారంభం మొదటి పూజజూన్ 26, జూలై ఒకటో తేదీ బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, సికింద్రాబాద్ బోనాలు... (లష్కర్ బోనాలు) జూలై 13 వ తేదీ బోనాలు, జూలై 14 వ తేదీ రంగంవుంటాయి. ఛ ఓల్డ్ సిటీ లాల్ దర్వాజ్ బోనాలు జూలై 20 వ తేదీ బోనాలు, జూలై 21 రంగం జరుగుతాయి. బోనాల ఉత్సవాలకు 20 కోట్ల రూపాయలతో ఏర్పాట్లు చేస్తున్నారు.

## స్కావెంజర్లు పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలి.. శిక్షణలో ఎంఈవో శ్రీనివాస్

రామాయంపేట, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడంలో స్కావెంజర్లు ముందుండాలని రామాయంపేట మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్ ఏర్కొన్నారు. మంగళవారం రామాయంపేట మండల వనరుల కేంద్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల నుండి హాజరైన




స్కావెంజర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు.ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో శుభ్రతను పాటించాలన్నారు. పాఠశాలలో టాయిలెట్లు శుభ్రంగా ఉంచడంతోపాటు మొక్కలను విరివిగా పెంచే బాధ్యత కూడా స్కావెంజర్లదేనని అన్నారు. ప్రతీ పాఠశాలలో కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రత కోసం ప్రభుత్వం చీపుర్లు, బ్రష్‌లు, టాయిలెట్ క్లీనర్లు అన్ని రకాల సామాగ్రిని అందజేస్తుందన్నారు.ఏ పాఠశాలలోనైనా శుభ్రత పాటించకుంటే ఆ పాఠశాలకు చెందిన స్కావెంజర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు సంతోష్, శ్రీకాంత్, రాజు, శంకర్ తదితరులు ఉన్నారు.

## దూమారం లేపుతున్న ఎమ్మెల్యే ముడుపుల వీడియో

నల్గొండ,ప్రజాసేవ చేయడానికి ఎన్నికైన ఓ ఎమ్మెల్యే.. ముడుపుల వసూళ్ల కోసం సొంతింట్లోనే వైన్స్ సిండికేట్ దుకాణాల దారులతో సమావేశం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. “కోట్ల రూపాయలు పెట్టి ఎన్నికల్లో గెలిచాం.. ఆ ఖర్చులన్నీ ఎక్కడినుంచి వస్తాయి..? ఎవరేం చేసినా నాకు రావాల్సిన డబ్బులు రావాల్సిందే. వైన్స్ సిండికేట్ నుంచి ముడుపులకు సదరు ఎమ్మెల్యే డిమాండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఆ సిండికేట్లలో ఒకరు వీడియో అంతా రికార్డు చేశారు. దాంట్లో సదరు ఎమ్మెల్యే ముఖం కనిపించినప్పటికీ.. ఆయన మాటలు స్పష్టంగా వినిపించాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. “ఈరోజు, రేపు ఎవరి సొక్కనీ, సుద్ద పూస.. తనకు మర్యాద ఇవ్వకుంటే ఎదుటి వారికి బే అవుతుందని ఏకంగా వార్నింగ్ ఇచ్చాడు సదరు ఎమ్మెల్యే. ఎదుటివాడు నాకు ఫోన్ చేసి మాట్లాడే దమ్ము ఉండాలి కదా అంటూ చెప్పుకొచ్చాడు. కోట్ల రూపాయలు పెట్టి గెలిచాం. బండి డీజిల్ ఖర్చులకే లక్షల రూపాయలు అవుతుంది.. అని వైన్స్ షాప్ సిండికేట్ వ్యాపారస్తులతో స్పష్టం చేశారు సదరు ఎమ్మెల్యే.వైన్స్ సిండికేట్లతో బేరసారాలకు దిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే వీడియో గుట్టు రట్టు చేసి.. సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తుంది ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ..

## 2027 నాటికి తెలంగాణలో రెండు విమానశ్రయాలు

అదిలాబాద్ జూన్ 10, తెలంగాణలో వైమానిక రంగం అభివృద్ధి చెందనుంది. వరంగల్‌లోని మామునూరు, ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌లో రెండు విమానాశ్రయాలు 2027 నాటికి అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది చివరిలో టెండర్లు ఆహ్వానించనున్నారు. మామునూరు విమానాశ్రయానికి కేంద్రం అనుమతి లభించింది. ఆదిలాబాద్‌లో పౌర విమానాశ్రయానికి వాయుసేన గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రెండు విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూరుస్తున్నాయి. దీనితో ఆర్థికాభివృద్ధి, పర్యాటకరంగం అభివృద్ధి చెందుతాయి. తెలంగాణ



రాష్ట్రం వైమానిక రంగంలో సరికొత్త శకానికి నాంది పలుకుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు.. వరంగల్ శివారులోని మామునూరు, ఆదిలాబాద్ శివారులోని శాంతినగర్‌లో రెండు కీలక విమానాశ్రయాలు 2027 చివరికల్లా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ మహత్తర ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన టెండర్లను ఈ ఏడాది చివరిలో ఆహ్వానించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం శంషాబాద్ విమానాశ్రయం మాత్రమే అందుబాటులో ఉన్న నేపథ్యంలో.. ఈ రెండు కొత్త ఎయిర్‌పోర్టులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, వాణిజ్య కార్యకలాపాలకు, పర్యాటక రంగానికి గణనీయమైన ఊపునివ్వనున్నాయి.వరంగల్‌లోని మామునూరు ప్రాంతానికి ఒక సుదీర్ఘ వైమానిక చరిత్ర ఉంది. నిజాం కాలంలో.. 1930లోనే నిర్మించబడిన ఈ విమానాశ్రయం 1981 వరకు సేవలందించింది. దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం, మామునూరు ఎయిర్‌పోర్టు విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమైంది. 2023 జూలై 31న రాష్ట్ర మంత్రివర్గం ఈ కొత్త ఎయిర్‌పోర్టుకు అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దీనిని బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కూడా పచ్చజెండా ఊపింది. విమానాశ్రయం పరిధిలో ఇప్పటికే 696 ఎకరాల భూమి అందుబాటులో ఉండగా, విస్తరణకు అవసరమైన అదనపు 253 ఎకరాల భూసేకరణకు తెలంగాణ ప్రభుత్వం రూ.205 కోట్లను కేటాయించి, పనులను వేగవంతం చేస్తోంది.విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక మరియు డిజైన్లను సిద్ధం చేయాలని రోడ్లు, భవనాల శాఖ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (కి లేఖ రాసింది. ఉడాన్ పథకం కింద ఈ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించడం, దీని ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. ఇది అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణతో పాటు, దక్షిణ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయి.ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు కల కూడా చాలా కాలంగా ఉంది. స్వాతంత్ర్యానికి ముందే, 1930లో, నిజాం కాలంలోనే యుద్ధ విమానాలకు ఇంధనం నింపడానికి 369 ఎకరాల భూమిలో ఏరోడ్రోమ్‌ను స్థాపించిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. జిల్లా అభివృద్ధికి విమానాశ్రయం అవసరమని స్థానికులు దీర్ఘకాలంగా కోరుతున్నారు. వారి ఆకాంక్షలను నెరవేరుస్తూ, కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదిలాబాద్‌లో పౌర విమానాశ్రయానికి అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు భారత వాయుసేన (ఎంఈ) నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ లభించిందని ఇటీవల రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.


# తిరుమలకు భారీగా పెరిగిన రద్దీ



తిరుమల, జూన్ 10,వేసవి సెలవులు ముగిసి మరో నాలుగురోజుల్లో పాఠశాలలు ప్రారంభంకానుండటంతో తిరుమలకు భక్తులు పోటెత్తుతున్నారు. తిరుమల కొండపై ఎటుచూసిన భక్త జన సందోహమే కన్పిస్తోంది. సెలవుదినాలు కావడంతో భక్తుల రద్దీ కొనసాగుతోంది. తిరుమలలో ఉన్న 31 కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయి శిలాతోరణం వరకు భక్తులు క్యూలైన్లలో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతోందని టీటీడీ అధికారులు వివరించారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు దర్శనానికి 6 గంటలు పడుతోంది. కల్యాణకట్టలు, లడ్డూ కేంద్రం, అఖిలాండం, అన్నప్రసాద భవనాలూ రద్దీగా మారాయి. గదులకు డిమాండ్ మరింత పెరిగిపోయింది. గదులు పొందేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరాల్సి వచ్చింది. సీఆర్వో ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. అలాగే అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాలు కూడా భక్తులతో కిటకిటలాడుతున్నాయిస్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీ చేసే భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసం కూడా రద్దీగా మారాయి. నిన్న స్వామివారిని 88వేల2వందల57 మంది భక్తులు దర్శించుకోగా 45వేల068 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల రూపేణ శ్రీవారి హుండీకి రూ.3.68 కోట్లు వచ్చాయని తెలిపారు. ఈనెల 9 నుంచి 11వతేదీవరకు తిరుమలలో శ్రీవారి ఆలయంలో సాలకట్ల జ్యేష్ఠాభిషేకం జరుగనుంది. ఏటా జ్యేష్ఠమాసంలో మూడురోజుల పాటు తిరుమల శ్రీవారికి జ్యేష్టాభిషేకం నిర్వహించనున్నారు. మొదటి రోజున శ్రీ మలయప్ప స్వామివారి బంగారు కవచాన్ని తొలగించి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నానం, తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి వజ్రకవచం అలంకరిస్తారు. రెండో రోజు ముత్యాల కవచంతో స్వామిని అలంకరిస్తారు. మూడోరోజు తిరుమంజనాదులు పూర్తిచేసి తిరిగి బంగారు కవచాన్ని సమర్పిస్తారు. జ్యేష్ఠాభిషేకం సందర్భంగా తిరుమలకు భక్తుల రాక మరింత పెరుగుతుందని టీటీడీ అంచనా వేస్తోంది.

# రాజకీయాల్లోకి జూనియర్...

విజయవాడ, జూన్ 10,ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు వచ్చినప్పుడల్లా జూనియర్ ఎన్టీఆర్ అంశం తెరపైకి వస్తుంది. తాజాగా కేకే సర్వే సంస్థలో కూడా ఎక్కువ మంది జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నట్లు తేలింది. పార్టీలకు అతీతంగా ఆయనకు మద్దతు లభిస్తుందని, అదే సమయంలో జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావాలని కోరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉందని తమ సర్వేలో తేలినట్లు కేకే సంస్థకు చెందిన సర్వే తెలిపింది. అంతే కాకుండా జూనియర్ ఎన్టీఆర్ కు పద్దెనిమిదేళ్లకు పైబడిన వారు మాత్రమే కాకుండా 42 ఏళ్లకు పైబడిన వారు కూడా రాజకీయాల్లోకి వస్తే మద్దతు తెలుపుతామని చెబుతున్నారని ఆ సంస్థ సర్వే లో వెల్లడయినట్లు కేకే సంస్థకు చెందిన కిరణ్ కోటేటి తెలిపారు. 2009 ఎన్నికల తర్వాత జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల జోలికి రాకపోయినా ఆయన ను కావాలనుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటం ఒకింత ఆశ్చర్యకరమేనని చెప్పాలి. దీంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశంపై చర్చ జరుగుతుంది. అయితే జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ఏ పార్టీకి మద్దతుదారుగా లేరు. తన తాత ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా ఉన్నానంటూ పలు మార్లు ప్రకటించిన జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తే ఎందులోకి వస్తారు? తెలుగుదేశం పార్టీలో ఇప్పుడయితే ఖాళీ లేదు. ఎందుకంటే నారా లోకేశ్ యువనేతగా టీడీపీలో పాతుకుపోయారు. టీడీపీ భవిష్యత్ నేతగా ఆయన ఎమర్జ్ అయ్యారు కూడా. ఆయన టీడీపీ జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. రేపో మాపో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యే అవకాశాలున్నాయి. అదే సమయంలో చంద్రబాబు తర్వాత టీడీపీ వారసత్వం కూడా లోకేశ్ కు మాత్రమే చెల్లుతుంది. . ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే ఆయనకు తెలుగుదేశం పార్టీ అంటే వల్లమాలిన ప్రేమ. అదే సమయంలో నారా కుటుంబంతో అంత సఖ్యత లేదు. తన తండ్రి హరికృష్ణ నుంచి ఆ గ్యాప్ అలాగే కొనసాగుతుంది. అదే సమయంలో టీడీపీని టేకోవర్ చేసే అవకాశం కూడా లేదు. ఎవరో అభిమానులు ఆశించినంత మాత్రాన అది ఆచరణలో సాధ్యమయ్యే పనికాదు. రాజకీయం వేరు.. సిల్వర్ స్క్రీన్ వేరు. పైగా జూనియర్ ఎన్టీఆర్ ది చిన్న వయసు. ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ గా మరిన్ని సినిమాలు చేయాలని ఆయన ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈ సమయంలో ఏపీ రాజకీయాల్లోకి వేలు పెడతారని ఎవరూ అనుకోరు. ఎందుకంటే ఆయన అనేక సార్లు ఇందుకు సంబంధించిన క్లారిటీ ఇచ్చేశారు. చేర్చారు ఇప్పుడున్న సమయంలో... తనకు సినిమాలంటే పిచ్చి అని అదే సమయంలో తన తాత స్థాపించిన తెలుగుదేశం పార్టీ అంటే ప్రేమ అని చెప్పారు. అంత మాత్రాన బంగారం లాంటి అవకాశాలున్న సినీ రంగాన్ని వదులుకుని ఏదో సాధిద్దామని, సేవ చేద్దామని అయితే ఈ వయసులో ఆయన రాజకీయాల్లోకి వచ్చే అవకాశం లేదు. ఇంకా అందుకు చాలా సమయం ఉంది. ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ ఆగమానికి కూడా సరైన సమయం కాదు. ఏపీలో పర్టిక్యులర్ గా టీడీపీ, వైసీపీ క్షేత్రస్థాయిలో బలంగా ఉన్నాయి. టీడీపీ దారుణంగా దెబ్బతిన్న సమయంలోనే ఆ ఛాన్స్ జూనియర్ కు దక్కే అవకాశముంది తప్పించి ఇప్పట్లో తారక్ రాజకీయ తెరపై మెరిసే అవకాశం లేదన్నది మాత్రం వాస్తవమని విశ్లేషణలు వెలువడుతున్నాయి.



# జగన్ అదే తప్పు... మళ్లీ..మళ్లీ చేస్తున్నారా

విజయవాడ, జూన్ 10, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం వస్తున్నారు. అది చూసి తనకు మళ్లీ అధికారం వస్తుందని నమ్ముతున్నారు. అందుకే కొంత నిర్లక్ష్యం జగన్ లో కనపడుతుంది. ఈసారి కూడా తన ఫేస్ ను చూసి మాత్రమే జనం ఓట్లు వేస్తారన్న నమ్మకంతోనే జగన్ ఉన్నట్లు కనపడుతుంది. ఎందుకంటే నాయకులతో నిత్యం సమావేశాలు జరపడం, సమీక్షలు నిర్వహించుకోవడం వంటి వాటికి జగన్ నాడు- నేడు దూరమే. అంతా నావల్లనే జరగాలన్న ధోరణిలోనే ఇంకా జగన్ ఉన్నట్లు కనపడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదైనా కార్యక్రమాలను చేపట్టడం ప్రతిపక్ష పార్టీకి అవసరం. ఎందుకంటే ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సింది కూడా ప్రతిపక్షమే.... అయితే ఏడాది నుంచి అనేక కార్యక్రమాలకు వైసీపీ పిలుపు నిచ్చింది. కానీ జగన్ మాత్రం అందులో ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. అనేక కార్యక్రమాలు చేపట్టినా జగన్ వాటికి దూరంగా ఉండటం, తాను ఒక్క పిలుపు నిస్తే చాలు అన్న వైఖరి జగన్ లో స్పష్టంగా కనపడుతుంది. ఏడాది నుంచి జగన్



రైతులకు గిట్టుబాటు ధరల విషయంలో బయటకు రావడం, అక్కడక్కడా పరామర్శలు, భరోసా యాత్రలు, వివాహాది శుభకార్యాలకు హాజరు కావడం మినహా జగన్ నేరుగా ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొనింది లేదు. అధికారంలోకి రానప్పుడు జగన్ దీక్షలు, ధర్నాలు స్వయంగా చేస్తూ జనానికి దగ్గరయ్యారు. కానీ మాజీ ముఖ్యమంత్రిగా ఆయన ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు.ఈ నెల 4వ తేదీన ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదంటూ వెన్నుపోటు దినం అని జగన్ ప్రకటించారు. అంతవరకూ బాగానే ఉంది. అది కూడా అందరూ నేతలు ఇందులో పాల్గొనాలని కోరారు. తాను మాత్రం బెంగళూరులో ఉన్నారు. ఇది క్యాడర్ లోనూ, ప్రజల్లోనూ తప్పుడు సంకేతాలు వెళుతుందని నేతలు చెబుతున్నారు. అదే జగన్ ఏదో ఒక జిల్లాలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొని ఉంటే కార్యక్రమానికి మంచి హైప్ వచ్చేదని, మీడియా అటెన్షన్ కూడా వచ్చేదని, జగన్ చేజేతులా ఈ అవకాశాలను తానే దూరం చేసుకుంటున్నారని సొంత పార్టీకి చెందిన సీనియర్ నేతలే వ్యాఖ్యానిస్తున్నారంటే జగన్ కు అర్థం కావడంలేదాజగన్ కూడా ఎన్నికలకు కొద్ది రోజులు ముందు మాత్రమే జనంలోకి రావాలని అనుకుంటున్నట్లుంది. అప్పటి వరకూ అడపా దడపా ఏవో కొన్ని కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్లడమే మంచిదని భావిస్తున్నారు. నేతలు, క్యాడర్ ను ముందుగా రోడ్డు మీదకు తీసుకు వచ్చి వారిని యాక్టివ్ చేసిన తర్వాత మాత్రమే తాను రంగంలోకి దిగాలని భావిస్తున్నట్లుంది. తాను హాజరయిన కార్యక్రమం సూపర్ సక్సెస్ కావాలని, అది అధికారాన్ని మళ్లీ తెచ్చె పెట్టేలా ఉండాలన్న ఆలోచనతోనే ఆయన ఈ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లుందని పార్టీకి చెందిన సీనియర్ నేతలే అంటున్నారు. అంటే ఒకవేళ గెలిస్తే క్రెడిట్ తన ఖాతాలో పడేలా జగన్ వ్యవహరిస్తున్నారని, అది మంచిది కాదని కొందరు వైసీపీ సానుభూతి పరులు కూడా సూచిస్తున్నారు. అధికారంలోకి రాకముందు ఉన్న పరిస్థితులను, నాడు చేసిన కార్యక్రమాలను గుర్తు చేసుకోవాలని కోరుతున్నారు.

# తగ్గేదెలా అంటున్న రెడ్డమ్మలు

కర్నూలు, జూన్ 10,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవంతో చెబుతున్న మాటలను కూడా ఎమ్మెల్యేలు లెక్క పెట్టడం లేదు. ఎమ్మెల్యేలు పనితీరును మెరుగుపర్చుకోకపోతే వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోతారని ఆయన చేసిన హెచ్చరికలు మామూలుగా చేసినవి కావు. ఆయన నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితం నేర్పిన పాఠాలను అనుసరించి ఆయన ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారు. కానీ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు మాత్రం అస్సలు మాట వినడం లేదు. తామే అన్నింటికీ అతీతులమని వారు నమ్ముతున్నారు. ముఖ్యంగా మహిళ ఎమ్మెల్యేలు కూడా అత్యధిక మంది ఎక్కువగా తమ తమ నియోజకవర్గాల్లో ఇటువంటి విమర్శలను ఎదుర్కొంటున్నారు.. అన్నీ మారుతాయి కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలే... 2024లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో దాదాపు ఎనభై ఎనిమిది మంది కొత్తవారు శాసనసభకు ఎన్నికయ్యారు. వీరిలో అత్యధిక మంది అతి చేస్తున్నారని చంద్రబాబుకు నివేదికలు అందుతున్నాయి. అందులోనూ తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయిన వారు నియోజకవర్గంలో చీమ చిటుక్కుమన్నా తమకు తెలియాల్సిందేనని అంటున్నారు. తాము చెప్పిన వారికి, సూచించిన వారికి మాత్రమే పదవులు, కాంట్రాక్టులు ఇవ్వాలంటూ అధికారులపై చిర్రుబుర్రులాడుతున్నారు. అంతటితో ఆగకుండా తమకు అడ్డం వచ్చిన వారిని అవసరమైతే పార్టీ పదవుల నుంచి తప్పించడానికి కూడా సిద్ధమవుతున్నారు. ప్రత్యర్థి పార్టీలు, తమకు గత ఎన్నికల్లో వ్యతిరేకంగా చేసిన వారిని కూడా మంచి చేసుకుని తర్వాత ఎన్నికలకు సిద్ధమవ్వాల్సిన వీరు సొంత పార్టీ నేతలను దూరం చేసుకుంటున్నారు. నా నియోజకవర్గం.. నా ఇష్టం అంటూ చెలరేగిపోతున్నారు. కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డిపై కూడా ఇలాంటి నివేదికలే అందాయి. క్యాడర్ ను పట్టించుకోకపోవడం, అంతా తాను చెప్పినట్లే నడుచుకోవాలని హుకుం జారీ చేయడం, పార్టీ నేతలను కూడా లెక్క చేయకపోవడం వంటివి కడప రెడ్డమ్మపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహంగా ఉన్నారు. మరోసారి కడప టిక్కెట్ మాధవి రెడ్డికి ఇస్తే తాము పరోక్షంగా అయినా ఓడిస్తామని తెలుగుదేశం పార్టీ నేతలే శపథాలు చేస్తున్నారంటే ఏ స్థాయిలో మాధవి రెడ్డి వ్యవహారశైలి ఉందో అర్థం చేసుకోవచ్చు. కడప నగర టీడీపీ అధ్యక్షుడు శివకొండారెడ్డిపై హత్యాయత్నం చేసిన వారిని ఆమె చేరదీయడం కూడా విమర్శలకు దారి తీసింది. మాధవి రెడ్డి మాటలు, తీరు సొంత పార్టీ నేతలనే ఇబ్బంది పెడుతున్నాయి. మహానాడు సక్సెస్ వెనక తామున్నామన్న ధీమాతో మాధవి రెడ్డి మరింతగా రెచ్చిపోతున్నారని టీడీపీ నేతలే చెబుతున్నారు. చంద్రబాబు దృష్టిలో మాధవి రెడ్డి పడ్డారని, ఏపీలో కేబినెట్ విస్తరణ జరిగితే మధవి రెడ్డికి బెర్త్ ఖాయమని ఆమె అనుచరులు ప్రచారం చేస్తున్నారు. ఇక ఆళ్లగడ్డలో తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచిన భూమా అఖిలప్రియ కూడా నిత్యం వివాదాల్లో చిక్కుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2014లో ఏకగ్రీవంగా గెలిచిన అఖిల ప్రియ 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2024లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తాను చెప్పినట్లే నడుచుకోవాలని ఆమె ఆదేశాలు జారీ చేయడంతో పాటు తాను సూచించిన వారికే పదవులు ఇవ్వాలంటున్నారు. హైకమాండ్ వద్ద పైరవీలు చేసుకుని పదవులు తెచ్చుకున్న వారిని ఆళ్లగడ్డ లో కాలు మోపనివ్వ బోనీయమని కూడా అఖిలప్రియ చేసిన హెచ్చరికలు పార్టీనే ఇబ్బందులు పెడుతున్నాయి. మరొక వైపు ఆళ్లగడ్డలో చికెన్ దుకాణాల నుంచి ఆమె అనుచరులు అక్రమంగా వసూళ్లకు దిగడం కూడా విమర్శలకు తావిస్తు ంది. ఇక అఖిలప్రియకు సొంత బంధువులందరూ దూరం కావడంతో పాటు పార్టీ నేతలను కూడా డోన్ట్ కేర్ గా వ్యవహరిస్తుండటంతో ఇప్పుడు అఖిలప్రియకు క్యాడర్ నుంచి కూడా కొంత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

# ప్రాణం తీస్తున్న ఈత సరదా...

రాజమండ్రి, జూన్ 10, ఈత సరదా చిన్నారుల ఉసురు తీస్తోంది. అడుతూపాడుతూ వేసవిలో సరదాగా గడిపేందుకు చిన్నారులు ఉత్సాహంగా చెరువులు, కుంటల్లో దిగి మృత్యువాత పడుతున్నారు. బంగారు భవిష్యత్ నీటిపాలు చేస్తున్న ఈ ఘటనలు వారి కుటుంబాలలో అంతులేని విషాదాన్ని నింపుతున్నాయి. గత 20రోజుల్లో జరిగిన మూడు ప్రమాదాలు కలచివేస్తున్నారు. వేర్వేరు ఘటనల్లో 17 మంది చనిపోవడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.నిన్నటికి నిన్న గోదావరిలో ఈతకు వెళ్లి గల్లంతైన ఆరుగురు జల సమాధి అయ్యారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, పోలీసులు నిర్విరామంగా శ్రమించి వారి మృతదేహాలను వెలికి తీశారు. సరదా కోసం వెళ్లి విగతజీవులుగా మారిన వారిని చూసి, మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పెళ్లి ఇంట్లో ఊహించని విషాదం జరగడంతో? రెండు గ్రామాల్లో రోదనలు మిన్నంటాయి.విషాద సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగింది. అంబటిపల్లి గ్రామంలోని ఒక ఇంట్లో రెండు రోజుల క్రితం పెళ్లి వేడుక జరిగింది. ఆ వేడుక కోసం వచ్చిన బంధువుల పిల్లలు మేడిగడ్డ బ్యారేజ్ చూడ్డానికి వెళ్లారు. సరదాగా కాసేపు ఈత కొడదామంటూ అందులోకి దిగారు? ఇక గోదావరి లోతు గుర్తించని చిన్నారులు అందులో మునిగిపోయారు. అలా ఒకరి వెంట మరొకరు మొత్తం ఆరుగురు గల్లంతయ్యారు. ఇక కొన్ని గంటలపాటు శ్రమించిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వాళ్ల మృతదేహాలను వెలికితీసింది.ఏపీలోని అల్లూరి జిల్లాలోనూ ఇలాంటి దారుణమే చోటుచేసుకుంది. అరకులోయ ఏజెన్సీలోని చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు బాలురు మృతిచెందారు. సరదాగా స్నేహితులతో గడిపేందుకు వెళ్లి మృత్యువాత పడ్డారు. దీంతో కుటుంబ సభ్యుల రోధన వర్ణణాతీతం.మొన్నామధ్య కోనసీమ జిల్లా ముమ్మిడివరంలోనూ పెను విషాదం జరిగింది. గోదావరిలో ఈతకు వెళ్లి ఎనిమిది మంది చనిపోయింది. వాళ్లు కూడా ఓ ఫంక్షన్‌కి వెళ్లి అట్నుంచి సరాదాగా ఫ్రెండ్స్‌తో ఈతకు వెళ్లారు. నీళ్లలోకి దిగి ఆడుకుండా లోతు గుర్తించలేకపోయారు. ఒకరిని, మరొకరు కాపాడే ప్రయత్నంలో ఎనిమిది మంది చనిపోయారు.ఈ వరుస ప్రమాదాలు ప్రభుత్వాలను ప్రశ్నించేలా చేస్తున్నాయి. ప్రమాదం జరిగితే హడావుడి చేసే రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం తర్వాత ఎందుకు పట్టించుకోవట్లేదన్న విమర్శలు వెల్లివెత్తున్నాయి. బోర్డులను ప్రదర్శించడం, తగిన హెచ్చరికలు జారీచేయడంలాంటి లేకపోవడం ఆగ్రహం తెప్పిస్తోంది. కనీసం వేసవిలోనైనా కొంతమేర ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటే కొంతవరకు చిన్నారులను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందని బాధిత తల్లిదండ్రులు వాపోతున్నారు.

# యోగాతో వ్యాధులు దూరం

శ్రీకాకుళం, యోగాసనాలతో వ్యాధులు దూరమవుతాయని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 4 చారిత్రాత్మక ప్రదేశాలులో జరుప తలపెట్టిన యోగా కార్యక్రమాలలో ఒకటవది డచ్ బంగ్లా వద్ద మే 27న జరుగగా, రెండవది శాలిహుండం బౌద్ధ క్షేత్రం వద్ద జూన్ 7న, మూడవది కళింగపట్నం బీచ్ వద్ద ఏర్పాటు చేసిన యోగాంధ్రను ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... యోగాసనాలను దిన చర్యలో ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగా వలన మనసు ప్రశాంతంగా, నెమ్మదిగా ఉంటుందన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. నిరంతరం ఆరోగ్యంగా ఉండేందుకు యోగా దోహదం చేస్తుందన్నారు. అందరూ యోగాంధ్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా నుండి 21 జరుగబోవు ప్రపంచ యోగా దినోత్సవానికి జిల్లా నుండి 80 వేల మందితో విశాఖపట్నంలో పాల్గొంటున్నామని, ప్రధాన మంత్రి పాల్గోనున్న కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. ఈ నెల 14వ తేదీన 2 వేల మందితో ఆర్ట్స్ కళాశాల మైదానం లో యోగాంధ్రా జరుగుతుందని అన్నారు.

# తిరుపతిలో శ్రీ ఆదివారాహి దేవాలయం కూల్చివేత

తిరుపతి.తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు లో స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతం పక్కన వెలసి ఉన్న శ్రీఆదివారాహి అమ్మవారి ఆలయాన్ని దుండగులు ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసారు. మంగళవారం ఉదయం 40 మంది పైచిలుకు దుండగులు ఆలయం వద్ద చేరుకొని ఆలయాన్ని ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న మహిళలపై దాడి చేసి గాయపరిచారు. ఈ దృశ్యాలని అక్కడి సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయను కోతవేటు దూరంలో ఉన్న శ్రీ ఆది వారాహి అమ్మవారి ఆలయాన్ని ధ్వంసం చేయడంపై వెంటనే పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని మహా రుద్ర వారాహి స్వామి భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కలకలం రేపుతున్న ఉత్తరాంధ్ర సర్వే


విశాఖపట్టణం, జూన్ 10, ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఈనెల 12 నాటికి ఏడాది పాలన పూర్తి కానుంది. గత ఏడాది అదే రోజు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మరో 24 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. పాలనా బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఏడాది కాలంలో ప్రభుత్వం దూకుడు నిర్ణయాలు తీసుకుంది. అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసింది. ఈ నెలలో కీలకమైన రెండు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు సిద్ధపడింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బాగానే కష్టపడుతున్నారు. రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. అయితే వారి విషయంలో ప్రజల నుంచి సానుకూలత వస్తోంది. కానీ ఎమ్మెల్యేల పనితీరుపై మాత్రం వ్యతిరేకత పెరుగుతోంది. ఈ విషయాన్ని పలు సర్వే సంస్థలు చెబుతున్నాయి. కూటమి ఎమ్మెల్యేలపై క్రమేపి వ్యతిరేకత పెరుగుతోందని హెచ్చరిస్తున్నాయి. వైసిపి హయాంలో కూటమికి అనుకూలంగా ఫలితాలు ఇచ్చిన రైజ్ సర్వే సంస్థ.. ఇప్పుడు కూటమికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని సర్వే వివరాలు వెల్లడించడం విశేషం. సదరు సర్వే ప్రతినిధి ప్రవీణ్ పుల్లట ప్రాంతాలవారీగా ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు ఇస్తున్నారు. తాజాగా ఉత్తరాంధ్రకు సంబంధించి సర్వే వివరాలను వెల్లడించారు. ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు, ఉమ్మడి విజయనగరంలో 9, ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో 34 అసెంబ్లీ స్థానాలకు గాను టిడిపి కూటమి 32 చోట్ల విజయం సాధించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రెండు చోట్ల మాత్రమే గెలుపొందింది. శ్రీకాకుళం తో పాటు విజయనగరంలో టిడిపి కూటమి క్లీన్ స్వీప్ చేసింది. పార్లమెంట్ స్థానాలను సైతం టిడిపి కూటమి గెలుచుకుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం అరకు పార్లమెంటు స్థానంతో సరిపెట్టుకుంది. అయితే ఇప్పుడు ఉత్తరాంధ్రలో టిడిపి కూటమి ఎమ్మెల్యేలపై ప్రజల్లో ఒక రకమైన అసంతృప్తి నెలకొని ఉందని రైజ్ సర్వే ఫలితాలు చెబుతున్నాయి. సగానికి పైగా ఎమ్మెల్యేలు వ్యతిరేకత ఎదుర్కొంటున్నారని ప్రవీణ్ పుల్లట సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. దీంతో ఇది టిడిపి కూటమికి మింగుడు పడని అంశంగా మారింది.32 మంది టిడిపి కూటమి ఎమ్మెల్యేలు 17 మంది పై అసంతృప్తి ఉందని తాజాగా ఈ సర్వే వెల్లడించింది. అయితే ఓ 9 మంది ఎమ్మెల్యేలపై మాత్రం తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లు స్పష్టమైంది. ఏడాది పాలన సందర్భంగా ప్రవీణ్ పుల్లట ఈ సర్వే ఫలితాలను వెల్లడించారు. నాలుగు ప్రాంతాల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్న మొత్తం ఎమ్మెల్యేల జాబితా మీకోసం అంటూ ఆయన హింట్ ఇచ్చారు. త్వరలో మిగిలిన మూడు ప్రాంతాల లెక్కలను విడుదల చేసేందుకు తమ రైజ్ సంస్థ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దీంతో టీడీపీ కూటమి శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. గతంలో ఇదే సంస్థ కూటమికి అనుకూల ఫలితాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.అయితే ఇటీవల వరుసగా వస్తున్న సర్వేలు చూస్తే ఎమ్మెల్యేలపై వ్యతిరేకత వుంటోంది. కానీ అదే సమయంలో ప్రభుత్వంపై కొంత సానుకూలత కనిపిస్తోంది. సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ చక్కగా పనిచేస్తున్నారని సర్వేల్లో తేలుతోంది. అయితే ప్రభుత్వ నిఘా వర్గాలు, అంతర్గత సర్వేలతోనే సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీ ఎమ్మెల్యేలకు గట్టి హెచ్చరికలే పంపుతున్నారు. పనితీరు మార్చుకోవాలని సూచిస్తున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు గట్టిగానే మాట్లాడారు. మొత్తానికైతే ఈ సర్వే ఫలితాలు కూటమికి మింగుడు పడడం లేదు

# జుట్టు రాలటానికి మూలాలివే.. ఇవి తెలిస్తే నివారణ సాధ్యం!



జుట్టు రాలడం అతి పెద్ద సమస్య, దీనికి అనేక కారణాలున్నాయి. జుట్టు రాలటానికి పోషక లోపాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి, ఎందుకంటే అనేక వ్యక్తులు అవసరమైన విటమిన్లు మరియు ఖనిజాలను ఆహారంలో తీసుకోవటం లేదు. ఒత్తిడి మరియు ఆందోళన కూడా జుట్టు రాలటానికి ప్రధాన కారణాలు. చాలా మంది అనుసరించే వేగవంతమైన జీవనశైలి కూడా జుట్టు రాలటానికి ప్రధాన కారణంగా మారుతుంది. జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలు వాతావరణ మార్పులు, వాతావరణ నమూనాలలో మార్పులు వంటి వాటి వల్ల జుట్టు ఆరోగ్యం ప్రభావితమవుతుంది. కొన్ని జుట్టు సంరక్షణ ఉత్పత్తుల వినియోగం కూడా ప్రతికూల ప్రభావాలను కలిగి ఉండవచ్చు. అదనంగా, జీర్ణ సంబంధ ఆరోగ్య సమస్యలు జుట్టు రాలడాన్ని ప్రభావితం చేయవచ్చు, జుట్టు రాలే సమస్యలు మొత్తం ఆరోగ్యానికి ప్రాధాన్యతను హైలైట్ చేస్తుంది. ం జుట్టు రాలటంలో కీలక పాత్ర పోషించేవి ఇవే జెనెటిక్స్ జుట్టు రాలడంలో మరో కీలక అంశం. కుటుంబ చరిత్ర వ్యక్తులను ఈ సమస్య ముందు నుండి ఉంటే వారికి కూడా ఈ సమస్య తప్పక వస్తుంది. వయస్సుతో సంబంధిత హార్మోన్ల మార్పులు కూడా జుట్టు పలుచబడడం మరియు రాలడంలో తోడ్పడతాయి. ఈ సహజ ప్రక్రియలు తరచుగా నివారించలేనివి కానీ సరైన సంరక్షణతో జుట్టు బాగా రాలే సమస్యను తగ్గించవచ్చు. జీవనశైలి, ఒత్తిడి జుట్టు ఆరోగ్యంపై ప్రభావం ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో పనులు చేసే జీవనశైలి ఒత్తిడి స్థాయిలను పెంచుతుంది. పరోక్షంగా జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. పర్యావరణ కాలుష్యం మరో సమస్య. ఇది జుట్టును హానికరమైన మూలకాలకు గురిచేస్తుంది. అంతేకాదు హానికరమైన రసాయనాల షాంపూ లను ఉపయోగించటం లేదా స్టైలింగ్ చేయటం కోసం ఉపయోగించే లేటెస్ట్ టెక్నాలజీలు కూడా పెరిగిన జుట్టు రాలడానికి దారితీస్తాయి. ఖనీలివతీవట ః౦ జుట్టు రాలటానికి కారణాల అధ్యయనం నివారణకు కీలకం ఈ కారణాలను అర్థం చేసుకోవడం జుట్టు రాలడాన్ని సమర్థవంతంగా పరిష్కరించడంలో సహాయపడుతుంది. జుట్టు పోషణపై దృష్టి పెట్టడం, ఒత్తిడిని తగ్గించుకోవటం మరియు అనుకూలమైన జుట్టు సంరక్షణ పద్ధతులను అవలంబించడం ద్వారా జుట్టు సంరక్షణకు కృషి చేయవచ్చు. కనుక జుట్టు రాలటానికి కారణాలు తెలుసుకుని తదనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

# మైగ్రేన్ తలనొప్పి వేధిస్తుందా? కారణాలు, లక్షణాలు, నివారణలు ఇవే!



ప్రస్తుత జీవన శైలి కారణంగా చాలామంది అనేక అనారోగ్యాల బారిన పడుతున్నారు. అటువంటి అనారోగ్య సమస్యలలో మైగ్రేన్ ఒకటి. మైగ్రేన్ అనేది తీవ్రమైన తలనొప్పితో కూడిన నాడీ సంబంధిత రుగ్మత. ఇది సాధారణంగా ఒత్తిడి కారణంగా వస్తుంది. తలకు ఒక వైపున లేదా రెండు వైపులా విపరీతమైన నొప్పితో కొన్ని గంటల నుండి రోజుల వరకు కూడా ఈ నొప్పి ఉండవచ్చు. మైగ్రేన్ లక్షణాలు మైగ్రేన్ యొక్క సాధారణ లక్షణాలలో తలనొప్పి తీవ్రంగా ఉండవచ్చు. కంటి చూపులో మార్పులు, కంటి చూపు మందగింపు, చేతుల్లో జలదరింపు, కడుపులో వికారం, వాంతులు, విరోచనాలు, కాంతి మరియు శబ్ద సున్నితత్వం, నీరసం, విపరీతమైన అలసట, కండరాల బలహీనత, హార్మోన్ల మార్పులు, ఒత్తిడి, ఆందోళన వంటి అనేక లక్షణాలు కనిపిస్తాయి. కుటుంబ చరిత్రలో మైగ్రేన్ ఉంటే కూడా మైగ్రేన్ వచ్చే అవకాశం ఉంటుంది. మైగ్రేన్ తలనొప్పి రావడానికి కారణాలు ఇవి కూడా కావొచ్చు కొందరిలో శరీరం డీహైడ్రేషన్ కు గురైతే కూడా మైగ్రేన్ వస్తుంది. మెడనొప్పి ఎక్కువగా ఉన్నవారిలో కూడా మైగ్రేన్ వచ్చే ప్రమాదం ఉంది. క్రమరహిత జీవనశైలి, భావోద్వేగ ఒత్తిడి, తీవ్రమైన శారీరక శ్రమ, పానీయాలను ఎక్కువగా తీసుకోవడం, సరైన సమయానికి తినకపోవడం కూడా మైగ్రేన్ తలనొప్పి రావడానికి కారణాలుగా చెప్పవచ్చు. వీటివల్ల మైగ్రేన్ తలనొప్పి ప్రమాదం ఎక్కువగా ప్రయాణాలు చేసే వారిలోనూ, వాతావరణంలో మార్పుల కారణంగాను, వెన్నెముక సమస్యలు ఉన్న వారిలోనూ, ఎక్కువగా ధూమపానం, మద్యపానం చేసే వారిలోనూ, మైగ్రేన్ సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదు. ఓరల్ కాంట్రాసెప్టివ్ పిల్స్ లాంటివి వాడే వారిలోనూ, నిరాశ ఆందోళనలకు లోనయ్యే వారిలోనూ, నిద్ర రుగ్మతలు ఉన్న వారిలోనూ మైగ్రేన్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మైగ్రేన్ తలనొప్పి కారణంగా ఈ ప్రమాదం మైగ్రేన్ తలనొప్పి వచ్చిన వారిలో కళ్ళు ఎర్రబడడం, కళ్ళల్లో నీళ్ళు రావడం, మాట్లాడలేకపోవడం, కళ్ళముందు జిగ్జాగ్ లైన్లు కనబడడం, శబ్దాలు వినిపించడం, కాళ్లు చేతులలో తిమ్మిర్లు రావడం, తల తిరగడం, వాంతులు కావడం, వికారం అనిపించడం, తలలో తీవ్రమైన నొప్పి రావడం వంటి సాధారణమైన లక్షణాలు కనిపిస్తాయి. అయితే మైగ్రేన్ తలనొప్పి తగ్గాలంటే అన్నిటికంటే ముందుగా జీవనశైలి మార్పులు చేసుకోవాలి. క్రమం తప్పకుండా నిద్ర మరియు ఆహారపు అలవాట్లు చేసుకోవాలి. మైగ్రేన్ తలనొప్పి తగ్గేందుకు ఇలా చెయ్యండి ఒత్తిడి నిర్వహించడానికి యోగా, ధ్యానం వంటి వాటిని చేయాలి. మైగ్రేన్ తలనొప్పి ట్రిగ్గర్ అయ్యే ఆహారాలను నివారించాలి. శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకునేందుకు తగినంత నీటిని తాగాలి. నొప్పి నివారణ ఔషధాలను, మైగ్రేన్ కు డాక్టర్ ఇచ్చే మందులను తప్పనిసరిగా వాడాలి. నొప్పి మొదలైనప్పుడు ప్రశాంతంగా నిశ్శబ్దంగా, కాంతిలేని ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవాలి. నొప్పి ఉన్నచోట వెచ్చని లేదా చల్లని కంప్రెస్ ను తలపైన పెట్టుకోవాలి. ఈ విధంగా మైగ్రేన్ తలనొప్పి నుంచి కొంతమేర ఉపశమనాన్ని పొందవచ్చు.

# నడుం నొప్పిగా ఉంటే ఇలా చెయ్యండి... చాలా మంచి రిలీఫ్!

నడుం నొప్పి చాలా మందిని వేధించే సాధారణ సమస్య . సాధారణ సమస్య అయినప్పటికీ నడుము నొప్పి చాలా ఇబ్బంది పెడుతుంది. దీన్ని ప్రాథమికంగా ఇంటిలోనే కొన్ని చక్కటి చిట్కాలతో తగ్గించుకోవచ్చు . నడుమునొప్పి కోసం ఇంటి నివారణలు ప్రస్తుతం మనం తెలుసుకుందాం. ఈ చిట్కాలు సాధారణ నడుం నొప్పిని తగ్గించడానికి సహాయపడతాయి.నడుము నొప్పితో బాధపడేవారు ఎక్కువసేపు కూర్చోవడం, ఎక్కువసేపు నిల్చోవడం, ఎక్కువ సేపు పడుకోవడం వంటివి చెయ్యకూడదు. నడుం నొప్పి నుండి ఉపశమనం కలిగించే చిట్కాలు నడుము పైన ఎక్కువ ఒత్తిడి పెట్టకూడదు. అధిక ఒత్తిడి లేకుండా కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడం మంచిది. ఎక్కువసేపు మంచం మీద పడుకునే ఉండడం మానుకోవడం మంచిది. ఈ విధంగా చేయడం కండరాలను బలహీనపరిచి నడుము నొప్పిని మరింత ఎక్కువ అయ్యేలా చేస్తుంది. సౌకర్యవంతమైన భంగిమలో పడుకోవడం, మోకాళ్ళ కింద దిండు పెట్టుకొని వెనక్కి పడుకోవడం వంటివి చేస్తే కాస్త నడుం నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. నడుం నొప్పి తగ్గించే రిలీఫ్ విధానాలు ఇక నడుం నొప్పితో ఎక్కువ బాధ పడేవారు హీట్ ప్యాక్ లేదా ఐస్ ప్యాక్ పెట్టుకుంటే నడుము నొప్పి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది. అంతేకాదు నడుము కండరాలకు ఉపశమనం కలిగించే ఎక్సర్సైజులు చేయడం కూడా మంచిది. కూర్చున్నప్పుడు లేదా నిలుచున్నప్పుడు నడుము భంగిమ సరైన విధంగా ఉండేలా చూసుకోవడం కూడా నడుము నొప్పి నుంచి రిలీఫ్ ఇస్తుంది. మసాజ్ లతో నడుం నొప్పి నుండి ఉపశమనం నడుం భాగంలో తేలికపాటి మసాజ్ లు చేసుకోవడం వల్ల కూడా కండరాల నొప్పి సడలి నడుము నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆలివ్ నూనె, కొబ్బరి నూనెలతో మసాజ్ చేయడం వల్ల నడుము నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. అల్లం టీ తాగడం వల్ల, ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో అర టీ స్పూన్



పసుపు కలిపి తాగడం వల్ల కూడా కాస్త ఉపశమనం ఉంటుంది. వీటిల్లో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు నడుం నొప్పిని తగ్గిస్తాయి. ఈ చర్యలతోనూ నడుం నొప్పి నుండి ఉపశమనం గోరువెచ్చని నీళ్లలో ఎప్సం సాల్ట్ కలిపి, ఆ నీళ్లలో ఒక క్లాత్ ను ముంచి, నడుము పైన కాపడం పెట్టడం వల్ల కూడా నడుమునొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఇక శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచడం వల్ల కూడా నడుం కండరాలకు ఉపశమనం కలిగి నడుమునొప్పి తగ్గుతుంది. నడుమునొప్పి తగ్గడానికి తాత్కాలిక ఉపశమనం కోసం ఇబుప్రోఫెన్, పారాసిటమాల్ వంటి టాబ్లెట్స్ కూడా నొప్పి నివారణ మందులుగా పనిచేస్తాయి. నొప్పి ఎక్కువగా ఉంటే ఇలా చెయ్యండి అయితే వైద్యుల సలహా మేరకు తీసుకోవడం మంచిది. ఇక నొప్పి తీవ్రంగా ఉంటే తప్పనిసరిగా డాక్టర్ ను సంప్రదించి డాక్టర్ సూచన మేరకు మాత్రమే మందులు వాడాలి. నడుము నొప్పి ఎక్కువగా ఉంటే కాళ్లల్లో తిమ్మిరి, బలహీనత అనిపిస్తాయి. నొప్పి ఒక వారం కంటే ఎక్కువగా ఉంటే, మూత్ర విసర్జనలో ఇబ్బంది కలిగినా తక్షణం వైద్యున్ని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం మంచిది.

# ఇవి ట్రై చేయండి, షుగర్ పెరగమన్నా పెరగదు..!!



మధుమేహం. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా కోట్లాది మందిని వెంటాడుతున్న సమస్య. షుగరు వచ్చిందంటే శరీరం మొత్తం ప్రభావితం అవుతుంది. ఏ ఒక్క భాగానికో కాదు. ప్రతీ అవయవం మీద తన శక్తిని చూపిస్తుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ముప్పు తప్పదు. మధుమేహానికి నియంత్రణ మాత్రమే సరైన మందు. మదుమేహ బాధితులకు ఆహారం.. జీవనశైలి అన్నింటి కంటే ముఖ్యం. ఇక, చిన్నపాటి చిట్కాలు.. ఆహారంలో మార్పులతో మధుమేహాన్ని నియంత్రించుకొనే అవకాశం ఉంది. రుచిని అందిస్తూనే షుగరు పెరగకుండా కడుపు నింపే ఆహారాలు మధుమేహ బాధితులకు ఎంతో మేలు చేస్తాయి మధుమేహం ఉంటే మధుమేహ నిర్వహణ లో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. అధిక ఫైబర్ మరియు తక్కువ గ్లైసెమిక్ సూచిక ఉన్న ఆహారాలు అనుకూలంగా ఉంటాయి. దక్షిణ భారతీయ వంటకాలు, అనుసరించినప్పుడు, ఈ ఆహార అవసరానికి సరిపోతాయి. ఇందుకు సంబంధించి ఆహార ఎంపికల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇడ్లీ, రాగి లేదా ఓట్స్ వంటి సంపూర్ణ ధాన్యాలతో వీటిని తయారు చేయవచ్చు. ఈ ప్రత్యామ్నాయాలు సాంప్రదాయ బియ్యం ఇడ్లీల కంటే ఎక్కువ ఫైబర్ అందిస్తాయి. దోశలను కూడా పోషక విలువను పెంచడానికి మల్టిగ్రైన్ పిండి ఉపయోగించి తయారు చేయవచ్చు. మధ్యాహ్న భోజనం దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కువగా సాంబార్ వినియోగిస్తారు. ఇది సహజంగానే ఆరోగ్యకరం. పప్పులు ,కూరగాయలను కలిగి ఉంటుంది, ఇవి ఫైబర్లో సమృద్ధిగా ఉంటాయి. నూనె పరిమాణాన్ని తగ్గించడానికి, తాలింపు తక్కువ నూనెతో లేదా ఎయిర్ ఫ్రయర్ ఉపయోగించి చేయవచ్చు. సాంబార్ తీసుకురావడానికి తెల్ల బియ్యం స్థానంలో బ్రౌన్ రైస్ ఎంచుకుంటే ప్రయోజనం ఉంటుంది. కూరగాయల కర్రీలు అదనపు పోషకాల కోసం పాలకూర లేదా మెంతి వంటి ఆకుకూరలను వినియోగించాలి. గ్రేవీలలో కొబ్బరి పాలను తక్కువ కొవ్వు పెరుగు తో మార్చవచ్చు. అదే విధంగా మధు మేహ బాధితులు స్నాక్స్ గా వడలు వంటి స్నాక్స్ తక్కువ కేలరీ పరిమాణం కలిగినవి తీసుకోవచ్చు. ఎక్కువగా గ్లెమిక్సిన్ లేని పదార్ధాలతో తయారీకి ప్రాధాన్యత ఇవ్వాలి. పాయసం వంటి సాంప్రదాయ స్వీట్ ను స్టీవియా, బెల్లం వంటి సహజ ప్రత్యామ్నాయాలతో తయారు చేసుకోవచ్చు. దీని ద్వారా సహజ సిద్దమైన తియ్యదనం వస్తుంది. పూర్తి క్రీమ్ పాల స్థానంలో స్కిమ్డ్ పాలు ఉపయోగించడం కొవ్వు పరిమాణాన్ని తగ్గించటంతో పాటుగా రుచిని కూడా ఇస్తుంది. ఇలా, ప్రాసెస్ చేసిన ఫుడ్ .. చెక్కెర ఉన్న పదార్ధాలు.. నిల్వ ఉన్న వాటికి దూరంగా ఉంటూ.. సరైన జీవన శైలిని.. వ్యాయామంతో జత చేసి.. ఆహారంలో సరైన పద్దతులను అలవాటు చేసుకుంటే మధుమేహ బాధితులకు షుగరు లెవల్స్ పెరగకుండా నియంత్రించుకోవచ్చు.

# కొందరికి చేపలు తినటం ఆరోగ్యం కాదు.. జాగ్రత్త!



గా ఉంటాయి. అయినా కొందరికి చేపలు తినటం మంచిది కాదు అందుకు చాలా కారణాలు ఉన్నాయి. చాలా మందికి చేపల కారణంగా అలెర్జీలు వస్తాయి. అలెర్జీల సమస్యలు ఉన్నవారు చేపలను తినకుండా ఉంటేనే మంచిది. చేపలు తింటే కొందరికి అనారోగ్యం చేపలు తిన్న వెంటనే తలనొప్పి, వాంతులు, దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అప్పటికప్పుడు షాక్ వంటి కొన్ని లక్షణాలు కనిపించొచ్చు. కొన్ని చేపలు కలుషిత నీటిలో పెరిగినవై ఉండవచ్చు. ఇవి టాక్సిన్స్‌ను కలిగి ఉండవచ్చు. ఇటువంటి చేపలు కూడా ప్రమాదకరం. ఇవి ఆరోగ్యానికి హానికరం. ఈ చేపలతో కొందరికి హాని హై మెర్క్యూరీ స్థాయిలు ఉన్న చేపలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. ముఖ్యంగా ట్యూనా, షార్క్, స్వోర్డ్‌ఫిష్ వంటి పెద్ద చేపలలో పాదరసం స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. ఇవి గర్భిణీ స్త్రీలు, పిల్లలు లేదా నాడీ వ్యవస్థ సమస్యలు ఉన్నవారికి హానికరం అని చెప్పొచ్చు. ముఖ్యంగా గర్భవతులూ, చిన్న పిల్లలూ ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. ఈ రోగాలున్న వారికి చేపలు తింటే ప్రమాదం కొన్ని రోగాలున్నవారికి చేపలు ప్రమాదకరం అని చెప్తారు. గౌట్, కిడ్నీ సమస్యలు ఉన్న వారికి చేపలు ప్రమాదకరం. చేపల్లో ప్యూరిన్లు ఎక్కువగా ఉండడం వల్ల గౌట్ రోగులకు ప్రమాదం. కిడ్నీ వ్యాధులు ఉన్నవారికి కూడా ఎక్కువ ప్రోటీన్‌ను ప్రాసెస్ చేయడం కష్టంగా మారవచ్చు. ప్రాసెసింగ్ సరిగ్గా చెయ్యని లేదా కాలుష్యం కారణంగా ఉన్నా చేపలు మనకు హాని చేస్తాయి. కొన్ని రకాల చేపలతో అనారోగ్యాలు .. జాగ్రత్త కొన్నిసార్లు చేపలు పరిశుభ్రంగా కాకుండా నిల్వ చేస్తే, లేదా కాలుష్యమైన నీటిలో పెరిగితే, వాటి ద్వారా హానికరమైన బ్యాక్టీరియా లేదా టాక్సిన్లు మన శరీరానికి హాని కలిగించే ప్రమాదం ఉంటుంది. ఒక్కోసారి చేపలలోని అధిక ప్రోటీన్ లేదా కొవ్వు కొందరి జీర్ణవ్యవస్థకు సరిపడకపోవచ్చు, ముఖ్యంగా కాలేయం లేదా గట్ సమస్యలు ఉన్నవారికి చేపలు ఇబ్బంది కలిగించవచ్చు. కనుక చేపలు తిన్న తర్వాత ఎవరికైనా ప్రతికూల లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవటం మంచిది.



# సినిమా



## హరి హర ..కింగ్‌డమ్ ఏంటీ నాన్నా పులి ఆట?




పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'హరి హర వీరమల్లు'.17వ శతాబ్దం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో పవన్ రాబిన్ హుడ్ తరహాలో సాగే గజదొంగగా కనిపించనున్నారు. మొఘల్ సామ్రాజ్యం నాటి పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాని జూన్ 12న భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నామంటూ ఇటీవల టీమ్ ప్రకటించింది. క్రిష్‌తో పాటు జ్యోతికృష్ణ డైరెక్ట్ చేసిన ఈ సినిమా రిలీజ్ మరోసారి వాయిదా పడటం పవన్ అభిమానుల్ని కలవరానికి గురి చేస్తోంది. పార్ట్ 1 మరోసారి వాయిదా పడిందని, జూన్ 28న రిలీజ్ చేస్తున్నామని, ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పోస్ట్ చేయడంతో అంతా అవాక్కయ్యారు. దీనిపై 'హరి హర టీమ్ స్పందించింది. ఈ ప్రచారంలో నిజం లేదని తేల్చి చెప్పింది. ఆ పోస్ట్‌లని నమ్మకండని, మా సోషల్ మీడియా ఖాతాల ద్వారా త్వరలోనే రిలీజ్ డేట్‌ని అధికారికంగా ప్రకటిస్తామని వెల్లడించింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ఆలస్యం కావడం వల్లే 'హరి హర విడుదల మరోసారి వాయిదా పడినట్టుగా తెలుస్తోంది. ఇక దీనితో పాటు వాయిదా పడుతున్న మూవీ 'కింగ్‌డమ్'. రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటించిన భారీ పాన్ ఇండియా మూవీ 'కింగ్ డమ్'. గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్నాడు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో సత్యదేవ్ విలన్‌గా నటిస్తున్నాడు. ఈ మూవీ రిలీజ్ కోసం గత కొన్ని నెలులగా రౌడీ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'లైగర్' తరువాత రౌడీ సైలెంట్ అయిపోవడంతో ఈ మూవీతో మళ్లీ ట్రాక్‌లోకి రావాలని బలంగా కోరుకుంటున్నారు. అయితే ఈ సినిమా కూడా వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. ముందు ఈ మూవీని మార్చి 28న రిలీజ్ చేస్తామని టీమ్ ప్రకటించింది. కానీ అది జరగలేదు. ఇక రీసెంట్‌గా జూలై 4న రిలీజ్ చేస్తున్నామంటూ మరో డేట్‌ని ప్రకటించింది. కానీ ఇప్పుడు ఆ డేట్‌న కూడా 'కింగ్‌డమ్ వచ్చే అవకాశం కనిపించడం లేదనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. అదే రోజు నితిన్ 'తమ్ముడు' రిలీజ్‌కు రెడీ అవుతుండటంతో 'కింగ్‌డమ్' జూలై 4న రిలీజ్ అయ్యే ఛాన్సే లేదనే వాదన వినిపిస్తోంది. 'తమ్ముడు' జూలై 4న రిలీజ్ కానున్న నేపథ్యంలో 'కింగ్‌డమ్'ని జూలై 25కు పోస్ట్ పోన్ చేయబోతున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో హరి హర వీరమల్లు, కింగ్‌డమ్ సినిమాల రిలీజ్‌ల కోసం ఎదురు చూస్తున్న అభిమానులు, సినీ లవర్స్ ఏంటీ నాన్నా పులి ఆట? అని వాపోతున్నారు. ఈ తరహాలో ఏ సినిమాలు వాయిదా పడలేదని, ఈ రెండు సినిమాలకే ఎందుకు ఇలా జరుగుతోందని అభిమానులు ఫీల్ అవుతున్నారట. మరి ఈ విషయం మేకర్స్ గమనిస్తున్నారో లేదో.

## ఎన్టీఆర్ బావమరిది.. వదిలేసి మంచి పని చేశాడు!



కొత్త హీరోలు కెరీర్ ఆరంభంలో చేసిన ఏదైనా సినిమా రిలీజ్‌కు నోచుకోక ఆగిపోవడం.. ఈలోపు వేరే సినిమాలు హిట్టయి వాళ్ల రేంజ్ మారిపోవడం.. ఆ తర్వాత ఆ ఆగిన సినిమా తెరపైకి రావడం.. దాన్ని ఆ హీరోలు లైట్ తీసుకోవడం.. చాలా సందర్భాల్లో జరిగింది. హీరోకు క్రేజ్ పెరిగాక దాన్ని క్యాష్ చేసుకోవాలని చూస్తారు కానీ... దాని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఇప్పుడు ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్ విషయంలోనూ అదే జరిగింది. అతడి తొలి సినిమాగా విడుదల కావాల్సిన శ్రీశ్రీశ్రీ రాజావారు.. ఎన్నో ఏళ్లు మరుగున పడి, ఈ శుక్రవారం విడుదలైంది. కానీ అది రిలీజవుతున్న సంగతే జనాలకు తెలియదు. చూసిన జనాలు కూడా పెదవి విరుస్తున్నారు. విడుదలైందే పరిమిత థియేటర్లలో. వాటిలోనూ ఆక్యుపెన్సీలు లేవు. ఈ చిత్రాన్ని శతమానం భవతితో జాతీయ అవార్డు సాధించిన సతీశ్ వేగేశ్న రూపొందించడం విశేషం. కానీ శతమానం భవతి తర్వాత పూర్తిగా ఫామ్ కోల్పోయిన సతీశ్.. ఈ చిత్రంలోనూ అదే ఫామ్‌ను చూపించారు. రొటీన్ కథ.. ఆసక్తి రేకెత్తించని కథనంతో నీరసం తెప్పించేశారని చూసిన ప్రేక్షకులు అంటున్నారు. నార్నె నితిన్ తొలి చిత్రంగా విడుదలైన మ్యాడ్ సూపర్ హిట్టయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అతడి నుంచి వచ్చిన ఆయ్, మ్యాడ్ స్క్వేర్ కూడా ఘనవిజయం సాధించాయి. నితిన్ క్యామియో రోల్ చేసిన సింగిల్ సైతం బాగా ఆడింది. ఈ సినిమాల పేర్లను పోస్టర్ల మీద వేసి.. వాటి హీరో నటించిన చిత్రం అంటూ ప్రచారం చేసుకుంది శ్రీశ్రీశ్రీ రాజావారు టీం. అయినా ప్రేక్షకులు ఈ సినిమా వైపు చూడలేదు.ఓ మలయాళ సినిమా ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం మీద నితిన్‌కు ముందు నుంచే నమ్మకం లేనట్లుంది. అందుకే దీన్ని పక్కన పెట్టేశాడు. వేరే చిత్రాల్లో నటించాడు. అవి మంచి ఫలితాన్నందుకున్నాయి. ఎట్టకేలకు శ్రీశ్రీశ్రీ రాజావారును రిలీజ్ చేస్తుంటే.. ఆ చిత్రాన్ని నితిన్ ఓన్ చేసుకోలేదు. ప్రమోషన్లకు రాలేదు. దాని గురించి ఒక ట్వీట్ కూడా వేయలేదు. దీంతో ప్రేక్షకులు కూడా ఈ సినిమాను పట్టించుకోలేదు. సినిమా ఎలా ఉన్నా కాస్త ప్రమోట్ చేయాల్సిందని కొందరంటుంటే.. దీన్ని అలా వదిలేయడమే మంచిదైందని కొందరంటున్నారు.

## పవన్ వెర్సస్ బాలయ్య.. తగ్గేదెవరు?

మెగా, నందమూరి బాక్సాఫీస్ క్లాష్ కొత్తేమీ కాదు. దశాబ్దాల నుంచి చూస్తున్నదే. ఈ సంక్రాంతికి కూడా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మూవీ గేమ్ చేంజర్, నందమూరి బాలకృష్ణ సినిమా డాకు మహారాజ్ పోటీ పడ్డాయి. అంతకుముందు చిరు సినిమా వాల్తేరు వీరయ్య, బాలయ్య చిత్రం వీరసింహారెడ్డి ఢీకొట్టాయి. గతంలో ఇంకా మరెన్నో సందర్భాల్లో మెగా, నందమూరి బాక్సాఫీస్ పోరును చూశాం. కానీ ఈ ఏడాది దసరాకు మరోసారి పోరు తప్పేలా లేదు.కానీ ఇప్పటిదాకా జరిగిన క్లాష్‌లు వేరు. ఈ పోరు వేరు. ఇప్పటికే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా ఓజీకి సెప్టెంబరు 25ను రిలీజ్ డేట్‌గా ఎంచుకున్నారు. పవన్ సినిమా వస్తోందంటే.. అంతకుముందే ఆ డేట్‌కు ఫిక్సయిన బాలయ్య చిత్రం అఖండ-2 రాదనే అనుకున్నారంతా. కానీ లేటెస్ట్‌గా రిలీజ్ చేసిన టీజర్లో సేమ్ డేట్ వేశారు. పక్కాగా సినిమా ఆ రోజే రాబోతోందని తేల్చేశారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో బాలయ్య, పవన్ మధ్య పోరును చూడాలని వారి అభిమానులు కోరుకోవట్లేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేనలతో కూడిన కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. గతంలో పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ బాలయ్య, పవన్ మధ్య ప్రస్తుతం మంచి సంబంధాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఇద్దరు హీరోలు బాక్సాఫీస్ దగ్గర తలపడితే బాగుండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సినిమాల కారణంగా ఇరువురి అభిమానుల మధ్య కలహాలు మొదలై.. సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్స్ తీవ్రమవుతాయేమ అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ రోజుల్లో అభిమానులు.. అవతలి హీరోల మీద సోషల్ మీడియాలో విషం చిమ్మడం పెరిగిపోతోంది. సంక్రాంతి టైంలోనూ అదే జరిగింది. తమ హీరో సినిమా బాగా ఆడాలని అనుకోవడం కంటే.. అవతలి హీరో సినిమా నాశనమైపోవాలని కోరుకునేవాళ్లే ఎక్కువైపోయారు. ఇందుకోసం పనిగట్టుకుని విష ప్రచారాలు చేసుకుంటున్నారు. తద్వారా అభిమానుల మధ్య వైరం పెరిగిపోతోంది. ఒకేసారి ఇద్దరు స్టార్ హీరోల సినిమాలు రిలీజైనపుడు ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో దసరాకు ఇద్దరు హీరోల్లో ఒకరు తగ్గి వేరే డేట్ చూసుకుంటే మంచిదేమో అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




## బన్నీ - త్రివిక్రమ్ క్రేజీ ప్రాజెక్ట్ పరిస్థితేంటీ?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ క్రేజ్ 'పుష్ప 2' తో పతాక స్థాయికి చేరింది. సుకుమార్ డైరెక్ట్ చేసిన ఈ భారీ పాన్ ఇండియా మూవీ ఇండియాతో పాటు వరల్డ్ వైడ్‌గా బాక్సాఫీస్ వద్ద చేసిన హంగామా అంతా ఇంతా కాదు. రిలీజ్ టైమ్‌లో తెలుగు రాష్ట్రాల్లో వివాదాల కారణంగా హాట్ టాపిక్‌గా నిలిచిన ఈ మూవీ ఓ సంఘటనతో వైరల్డ్ వైడ్‌గా వైరల్‌గా మారడం తెలిసిందే. ఆ క్రేజ్‌తో ఈ సినిమా అనుకున్న దానికి మించి వరల్డ్ వైడ్‌గా బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయిలో రూ.1800 కోట్లకు మించి వసూళ్లని రాబట్టి బన్నీ కెరీర్‌తో సరికొత్త హిస్టరీని క్రియేట్ చేసిందిఈ క్రేజీ పాన్ ఇండియా మూవీ తరువాత అల్లు అర్జున్ మాటల మాంత్రికుడిగా పేరున్న త్రివిక్రమ్‌తో ఓ భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టాలని ప్లాన్ చేశారు. దీన్ని అధికారికంగా కూడా ప్రకటించారు. అయితే మైథలాజికల్ టచ్‌తో భారీ స్థాయిలో తెరపైకి తీసుకురావాలనుకున్న ఈ ప్రాజెక్ట్‌కు మరింత సమయంపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో బన్నీ తాజాగా మరో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం తెలిసిందే. తమిళ దర్శకుడు అట్లీ డైరెక్షన్‌లో పాన్ వరల్డ్ మూవీకి అల్లు అర్జున్ రెడీ అయ్యారు.సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ మూవీకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ చకచక జరిగిపోతోంది. ఇప్పటికే హీరోయిన్ గా దీపికా పదుకునేని ఫైనల్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇంతకీ బన్నీ, త్రివిక్రమ్ ప్రాజెక్ట్ ఉన్నట్టా లేనట్టా? అనే అనుమానాలు మొదలయ్యాయి. అంతే కాకుండా ఈ ప్రాజెక్ట్ ఆగిపోయిందని, ఇక ఈ ప్రాజెక్ట్ లేనట్టేనని కూడా ప్రచారం మొదలైంది. అయితే యువ నిర్మాత, బన్నీకి అత్యంత సన్నిహితుడు బన్నీ వాసు మాత్రం ఈ ప్రాజెక్ట్ ఉంటుందని, త్రివిక్రమ్, బన్నీ ఎప్పుడు రెడీ అంటే అప్పుడు ఈ సినిమా మొదలవుతుందని క్లారిటీ ఇచ్చాడు. బన్నీ ప్రస్తుతం అట్లీ ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్న నేపథ్యంలో ఆ టైమ్‌ని మరో ప్రాజెక్ట్‌కు వాడుకోవాలని త్రివిక్రమ్ ప్లాన్ చేసుకుంటున్నట్టుగా తెలుస్తోంది.



## ధనుష్ 'కుబేర' రన్ మూడు గంటలు కాదా?

ప్రతి డైరెక్టర్, ప్రొడ్యూసర్‌కు రన్ టైమ్ టెన్షన్ ఉండేది కానీ 'అర్జున్ రెడ్డి' తరువాత ఆ టెన్షన్ ఎవరిలోనూ కనిపించడం లేదు. ఎందుకంటే కంటెంట్ బాగుంటే రన్ టైమ్ పెద్ద ఇష్యూ కాదని అర్జున్‌రెడ్డి నిరూపించడంతో చాలా వరకు స్టార్ హీరోలు, డైరెక్టర్లు రన్ టైమ్ 3 గంటలు అయినా సరే వెనుకాడటం లేదు. ఈ మధ్య విడుదలైన యానిమల్, పుష్ప 2 రన్ టైమ్ కూడా మూడు గంటలపైనే ఉండటం, అవి ప్రేక్షకుల్ని విశేషంగా అలరించడంతో ఇప్పుడు అంతా తమ సినిమాల రన్ టైమ్ మూడు గంటలపైనే ఉండేలా చూసుకుంటున్నారు. ఇదిలా ఉంటే సెన్సిటీవ్ సినిమాల దర్శకుడిగా పేరున్న శేఖర్ కమ్ముల ప్రస్తుతం ధనుష్ హీరోగా కింగ్ నాగార్జున కీలక పాత్రలో 'కుబేర'ని తెరకెక్కించిన విషయం తెలిసిందే. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించిన ఈ మూవీ జూన్ 20 అంటే మరో పదిరోజుల్లో పాన్ ఇండియా మూవీగా వరల్డ్ వైడ్‌గా భారీ స్థాయిలో రిలీజ్‌కు రెడీ అవుతోంది. ధనుష్ బిచ్చగాడిగా, నాగార్జున కోటీశ్వరుడిగా నటించిన ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా ఈ మూవీ రన్ టైమ్‌పై రక రకాల వార్తలు షికారు చేయడం మొదలైంది. శేఖర్ కమ్ముల రెగ్యులర్‌గా తన సినిమాల కోసం ఎక్కువ ఫుటేజ్‌ని వాడుతాడని, దాన్ని ఎడిటర్ టేబుల్ వద్దకు వచ్చేసరికి కావాల్సిన వరకు ట్రిమ్ చేస్తారనే టాక్ ఉంది. అయితే ఇటీవల రన్ టైమ్ విషయంలో ఎవరూ రాజీపడటం లేదు కాబట్టి 'కుబేర' రన్ టైమ్ కూడా మూడు గంటలకు పైనే ఉంటుందని అంతా భావించారు. కానీ అందుకు భిన్నంగా శేఖర్ కమ్ముల ప్లాన్ చేసుకుని ఈ మూవీ రన్ టైమ్‌ని మూడు గంటలలోపే కుదించడం విశేషం. ఒక దశలో ఈ సినిమా రన్ టైమ్ మూడు గంటల నలభై ఐదు నిమిషాలు ఉంటుందని కూడా ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాలకు ఫుల్ స్టాప్ పెడుతూ టీమ్ 'కుబేర' రన్ టైమ్‌ని 2 గంటల 50 నిమిషాలకు ఫిక్స్ చేశారు. నాగార్జున కారణంగా తెలుగు రాష్ట్రాల్లో మంచి బిజినెస్ చేసిన ఈ మూవీకి ప్రమోషన్స్ మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోవడం సినీ అభిమానుల్ని కలవరానికి గురి చేస్తోంది. పాన్ ఇండియా మూవీగా రిలీజ్‌కానున్న ఈ ప్రాజెక్ట్‌కు ఆశించిన స్థాయిలో పబ్లిసిటీ లేకపోవడం, ఇప్పటికీ దేవిశ్రీప్రసాద్ రెండు పాటలని ఇంకా పెండింగ్ పెట్టడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది.



## వేశ్యల రాజధాని అనడం ఆడ జాతికే అవమానం

### జర్నలిస్టు కృష్ణంరాజు, వ్యాఖ్యాత కేఎస్ఆర్ వ్యాఖ్యలపై మండిపడిన టిడిపి మహిళా నాయకురాల్లు

### కర్నూల్లో టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో రోడ్డెక్కి నిరసన తెలిపిన మహిళలు



కర్నూలు(విజయ సారథి):అమరావతి వేశ్యల రాజధాని అంటూ వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, డిబేట్ నిర్వహించిన సాక్షి టివి ఛానల్ వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావులపై కఠినమైన చర్యలు తీసుకోవాలంటూ కర్నూల్లో తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలు రోడ్డెక్కి నిరసన తెలియజేశారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నుండి కలెక్టరేట్ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. మహిళల జోలికొస్తే ఊరుకోమని హెచ్చరించారు.టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ మాట్లాడుతూ వైసీపీ పేటీయం బ్యాచ్ మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుందన్నారు. ఇలాంటి పాలన గత ఐదేళ్లు చూసిన తర్వాతనే ప్రజలు వైసీపీని సాగనంపారని.. ఇప్పటికైనా వైఎస్ జగన్ బుద్ధి తెచ్చుకోవాలని హితవుపలికారు. తల్లికి, చెల్లికి విలువ ఇవ్వని వ్యక్తికి మహిళల విలువ ఏం తెలుస్తుందని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి అమరావతి రైతులు 30 వేల ఎకరాలు త్యాగం చేస్తే ఆ మహిళలపై జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కొమ్మినేనిని అరెస్టు చేసిన విధంగానే కృష్ణంరాజును కూడా వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. వై.ఎస్ భారతిరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తాడెపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామన్నారు.అనంతరం వాల్మికి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవలక్ష్మి మాట్లాడుతూ సాక్షి మీడియా మహిళల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకే ఇదంతా జరుగుతోందన్నారు. వాళ్ల ఇంట్లో మహిళల గురించి ఎవ్వరూ, ఏ రోజూ ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. రాజధాని అంటే ఏంటో తెలియని పరిస్థితి అప్పట్లో ఉండేదని, చంద్రబాబు అమరావతిని రాజధాని చేస్తే చూస్తూ ఓర్వలేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.టిడిపి నగర అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జర్నలిస్టు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావుపై ఇప్పటికే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుచేశామన్నారు. అమరావతి దేవతల రాజధాని అని సీఎం చంద్రబాబు నాయుడు అంటుంటే.. వీళ్లు వేశ్యల రాజధాని అంటూ మాట్లాడటం దారుణమన్నారు. మహిళలు వీళ్లకు వేశ్యల్లాగా కనిపిస్తున్నారని మండిపడ్డారు. అమరావతి మహిళలను అవమానిస్తే ఆడ జాతిని అవమానించినట్లేనన్నారు. సాక్షి ఛానల్‌లో సిగ్గు లేకుండా మహిళలను కించపరుస్తూ మాట్లాడుతున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి క్షమాపణ చెప్పితీరాలన్నారు.నియోజకవర్గ అధ్యక్షురాలు మారుతీశర్మ మాట్లాడుతూ సాక్షి ఛానల్‌ను వెంటనే బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. భారతి రెడ్డి మహిళే కాబట్టి ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో మహిళల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. వీరిపై చర్యలు తీసుకోకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రమణమ్మ, మాజీ కార్పొరేటర్లు, బూత్ ఇంచార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి మహిళలను కించపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి





## సర్వసభ్య సమావేశం ప్రతిపాదనలపై కమిషనర్ శాఖాధిపతులతో సమీక్ష

### అజెండా అంశాలపై ప్రస్తుత పరిస్థితుల పరిశీలన, చర్యలపై దృష్టి



విజయవాడ(విజయ సారథి):సర్వసభ్య సమావేశం ప్రతిపాదనలపై శాఖాధిపతులతో సమీక్ష నిర్వహించారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. మంగళవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో రానున్న సాధారణ సర్వ సభ్య సమావేశం లోగల అజెండా విషయాలపై శాఖాధిపతులతో చర్చించారు.విజయవాడ నగరాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు పొందుపరిచిన సాధారణ సర్వసభ్య సమావేశపు అజెండాలో అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిపై ప్రస్తుతమున్న స్థితిగతులు, తీసుకోవాల్సిన చర్యలు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని అన్నారు. జోన్ వారీ అభివృద్ధి పనులు, ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలు అందించే కౌన్సిల్ ఎజెండా ప్రతిపాదనలు సహకరించాలని అన్నారు.

# పేద ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి

### మెరుగైన పౌష్టికాహారాన్ని పేద బిడ్డలకు అందించాలి

### జైలు ఖైదీలు కంటే ఘోరంగా విద్యార్థులకు భోజనమా?

### బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు



మదనపల్లి(విజయ సారథి):రాష్ట్రంలో పేద విద్యార్థుల బువ్వ కంటే ఖైదీలు ఉండే నయమా అన్నట్లు పరిస్థితి ఉందని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆవేదన చెందారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్స్ విద్యార్థుల భోజన విషయంలో అన్ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని వీరు దుయ్యబట్టారు. నేడు అన్నమయ్య జిల్లా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన నిరసన కార్యక్రమంలో వీరు మాట్లాడుతూరాష్ట్రంలో సాధారణ ప్రభుత్వ హాస్టల్స్, కస్తూరిబా,మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, విద్యార్థులు నడుపుకుంటున్న హాస్టల్స్లో (స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్) ఐదో తరగతి నుంచి పదవ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి మూడు పూటల భోజనం ఖర్చు 46 రూపాయలు,, ఇంటర్ నుండి పీజీ వరకు ఒక్కో విద్యార్థికి మూడు పూటల భోజనం ఖర్చు 53 రూపాయలు లుగా ప్రభుత్వం అందిస్తూ ఉన్నది. కాంట్రాక్టర్లు కూడా దీన్ని చులకన భావంతో, లాభపేక్షతో పౌష్టికాహార లోపంతో ఈ భోజన పథక విధానాన్ని అవలంబిస్తున్నారన్నారు. ప్రస్తుత ఈ విధానంపై చిత్తూరు తెలుగుదేశం పార్టీ శాసన సభ్యులు గురజాల జగన్మోహన్ గతవారం కలెక్టర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని తిని నాలుగు రోజులు ఇబ్బంది పడినట్లు, విద్యార్థులు ఏ రకంగా దీన్ని జీర్ణించుకుంటారో అని ఆవేదన చెంది మెరుగైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్లకు సూచించారన్నారు. పక్క రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు సన్నబియ్యం అందించి పౌష్టికాహారాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకుంటూ ఉంటే మన ప్రభుత్వాలు జైలు ఖైదీల కంటే ఘోరంగా విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నారని ఆవేదన చెందారు. ఒక్క జైలు ఖైదీకి మూడు పూటలా భోజనం ఖర్చు 225 రూపాయలుగా ఉందని, వీరిలో సగభాగం కూడా విద్యార్థులకు ఖర్చు పెట్టట్లేదని ఈ విధానం ప్రభుత్వం మార్చుకోవాలని వీరు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ బీసీ సంఘాల నాయకులతోపాటు సిపిఐ, ఎస్ఎఫ్ఐ రాయలసీమ విద్యార్థి సంఘాలు పాల్గొని వారు మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరంలోపు కనీసం బియ్యం పంపిణీ విధానాన్ని మార్చి సన్నబియ్యాన్ని విద్యార్థులకు అందించి నాణ్యమైన పౌష్టికాహారాన్ని, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే పెంచాలని వీరు డిమాండ్ చేశారు. ఈ విషయమై బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చందు గారు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులను కలిసి విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని కూలంక సంఘ వివరించి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారని తెలియజేశారు. రాష్ట్రంలో అన్ని బహుజన సంఘాలు, ఎస్సీ ఎస్టీ బీసీ సంఘాలు ఈ విషయాన్ని పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తాయని ప్రభుత్వం ఆ పరిస్థితి తెచ్చుకోవద్దని వీరు హెచ్చరించారు. నిరసన కార్యక్రమం సుమారు గంటపాటు నిర్వహించారు ఈ కార్యక్రమంలో అన్ని సంఘాలతో పాటు పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షులు కోనేటి దివాకర్ గారు, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు నరసింహులు గారు, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం గారు, వాల్మీకి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం మహిళా నాయకురాలు మల్లికా గారు, ఓబీసీ విద్యార్థి సంఘం వెంకట్ యాదవ్ గారు, సిపిఐ మురళి గారు, భోజన సేన మహిళ అధ్యక్షురాలు మేరీ గారు, బహుజన సేన నాయకులు గిన్నెల మనోహర్ రెడ్డి, పుల్లూరి జయశంకర్, ఆటో యూనియన్ నాయకుల లక్ష్మీనారాయణ గారు,, కొమ్ము హరిబాబు, రాఘవేంద్ర యాదవ్, బురుజు శివశంకర్, భాను ప్రకాష్, సిద్ధిగల నరేష్, మావిళ్ళ వెంకటేష్, ముక్తియార్ భాష, ప్రభాకర తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికే తలమానికంగా.. గోల్డ్ జ్యువెలరీ మేకింగ్ క్లస్టర్..!

### ప్రొద్దుటూరు గోల్డ్ మర్చంట్స్ కమిటీ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప(విజయ సారథి):పుత్తడిపురిగా పేరుగాంచిన ప్రొద్దుటూరు పట్టణంలో రాష్ట్రానికే తలమానికంగా గోల్డ్ జ్యువెలరీ మేకింగ్ క్లస్టర్ (జీజేఎంసీ) ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో ప్రొద్దుటూరులో గోల్డ్ జ్యువెలరీ మేకింగ్ క్లస్టర్ ఏర్పాటుపై ప్రొద్దుటూరు గోల్డ్ మర్చంట్స్ అసోసియోషన్ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిమాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు ఆయన పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా పుత్తడిపురిగా పేరు గాంచిన ప్రొద్దుటూరు పట్టంలో రాష్టానికే తల మానికంగా గోల్డ్ జ్యువెలరీ మేకింగ్ క్లస్టర్ (జీజేఎంసి) ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. బంగారు వ్యాపారంలో రెండవ బాంబేగా ప్రసిద్ధిగాంచిన ప్రొద్దుటూరు పట్టణంలో.. జీజేఎంసి ఏర్పాటు అయితే బంగారు నగలు తయారీ రంగంలో వైఎస్ఆర్ కడప జిల్లాకు దేశ వ్యాప్త గుర్తింపు వస్తుందన్నారు. పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగిన తయారీదారులను, పెట్టుబడి దారులను ప్రోత్సహిస్తోందన్నారు.జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువ మందికి ఉ పాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని కూడా అందిస్తోందన్నారుఈ సమావేశంలో ఏపీఐఐసి జెడ్ఎం శ్రీనివాస మూర్తి, పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, ఎల్డిఎం జనార్ధనం, డిటిసి డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్ రంగరాజు, పశు సంవర్ధక శాఖ జెడి డా. శారదమ్మ, ప్రొద్దుటూరు గోల్డ్ మర్చంట్స్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎం.పి కేశినేని శివనాథ్(చిన్ని) కార్యాలయంలో ఘనంగా ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలు.

విజయవాడ(విజయ సారథి)బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ చైర్మన్, హిందుపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఘనంగా నిర్వహించారు. తెలుగు మహిళలు,టిడిపి నాయకులు, తెలుగు యువత విద్యార్థులు , కార్యకర్తలు ఆనందోత్సహాల మధ్య కేక్ కట్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ తెలుగు సినీ రంగంలో అగ్ర కథానాయకుడిగా రాణిస్తూ బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ గా ఎంతో మంది పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న కల్మషం లేని వ్యక్తి హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ అంటూ కొనియాడారు. బసవతారకం కేన్సర్ హాస్పిటల్ చైర్మన్‌గా అనేక మంది క్యాన్సర్ రోగులకు ప్రాణదానం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ , ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, విజయవాడ పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి చిట్టా నిర్మల, టిడిపి నాయకులు బొప్పన భవనకుమార్, వల్లభనేని నరసింహాచౌదరి, పేటెటి రాజమోహన్, కిలారి చంద్రశేఖర్,బొర్రా గాంధీ, మాదిగాని గురునాథం,కాకు మల్లిఖార్జునరావు, సంకె విశ్వనాథం, పరిశపోగు రాజేష్, ఎమ్.డి. ఇర్ఫాన్, అబీద్ హుస్సేన్,, తెలుగు మహిళ నేతలు రాయి రంగమ్మ, వీరపనేని అరుణ, ఎస్.సున్నాబి, మొకరు రంగ మహాలక్ష్మీ, ఎస్.అమినా, జి.పండు, ఎస్.కె.ఫాతిమా, గౌరి, శైలు, ఎస్.కె.రమీజా, కె.స్రవంతి, మాదాల రాజ్యలక్ష్మీ, మాదాల సత్య లతో పాటు తెలుగు యువత విద్యార్థులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాష్ట్ర మహిళలకు వై.ఎస్.భారతి రెడ్డి , కృష్ణంరాజు బహిరంగ క్షమాపణలు చెప్పాలి

### పశ్చిమ నియోజవకర్గంలో మహిళ, యువజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

### వెస్ట్ టిడిపి కార్యాలయం నుంచి చిట్టినగర్ వరకు సాగిన ర్యాలీ



విజయవాడ(విజయ సారథి):ఎమ్మెల్యే జగన్ రెడ్డి, సాక్షి నిర్వహకురాలు వై.ఎస్.భారతి రెడ్డి మెప్పు కోసం అమరావతి రాజధాని నిర్మాణ పనులు అడ్డుకునేందుకు, విషం చిమ్మే కుట్రలో భాగంగా సాక్షి మీడియాలో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదు. సాక్షి టీవీ ఛానెల్ లో అమరావతి మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడిన ఎనలిస్ట్ కృష్ణంరాజు, అమరావతి రాజధాని పై విషం చిమ్మేందుకు సహకరించినందుకు సాక్షి మీడియా నిర్వహకురాలు వై.ఎస్.భారతి రెడ్డి రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని మహిళ, యువజన విద్యార్థి సంఘాలు,అమరావతి మహిళలు డిమాండ్ చేశారు. మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడి భావ స్వేచ్ఛ ప్రకటన వుందని చెప్పుకోవటం సిగ్గు చేటన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎవరు సహించేది లేదని, దేనికైనా ఒక హద్దు వుంటుందని హెచ్చరించారు.పశ్చిమ నియోజకవర్గంలో మంగళవారం మహిళ, యువజన విద్యార్థి సంఘాలు, అమరావతి మహిళల ఆధ్వర్యంలో సాక్షి ఛానెల్ లో ప్రసారమైన వ్యాఖ్యలకు నిరసనగా భారీ ర్యాలీ జరిగింది. ఈ నిరసన ర్యాలీ పంజా సెంటర్ దగ్గర గల గణపతి రావు రోడ్డు లోని పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి చిట్టినగర్ సెంటర్ వరకు సాగింది. అమరావతి మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన ఎనలిస్టు కృష్ణంరాజు, సాక్షి మీడియా నిర్వహకురాలు వై.ఎస్.భారతి రెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ నిరసన ర్యాలీలో ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆశా, జనసేన కృష్ణ పెన్నా రీజనల్ కో ఆర్డినేటర్ రావి సౌజన్య, బిజెపి మహిళా మోర్చా స్టేట్ ప్రెసిడెంట్ ఆఫీస్ సెక్రటరీ కర్రినాగలక్ష్మీ, పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు సుఖాసి సరిత, పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, పశ్చిమ నియోజకవర్గ టి.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షుడు భాను, టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, తెలుగు మహిళ కార్యనిర్వహక కార్యదర్శి మాదల చిన్నతల్లి, అంగన్వాడీ స్టేట్ మీడియా కో ఆర్డినేటర్ చెరుకూరి మాధవి, కార్పొరేటర్ ఉమ్మడి చంటి లతో పాటు పశ్చిమ నియోజకవర్గ అనుబంధ సంఘాల నాయకులు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల,జూన్10: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మంగళవారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో స్వామివారి ఉచిత దర్శనం కోసం వచ్చిన భక్తులతో వైకుంఠ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్ మెంట్లు నిండిపోయాయి. దీంతో వెంకన్న సర్వ దర్శనానికి టోకెన్ పొందిన భక్తులకు 18 గంటల సమయం పడుతుంది. సోమవారం 84,258 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 35,776 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. స్వామి వారి హుండీ ఆదాయం రూ. 3.90 కోట్లుగా ఉ ందని టిటిడి అధికారులు వెల్లడించారు.

## శ్రీరామరెడ్డి తాగునీటి పథకం అడ్డంకులు లేకుండా పనిచేయాలి

### కార్మికులు, కాంట్రాక్టర్లు, అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

### :జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్

అనంతపురం(విజయ సారథి):శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ఎలాంటి అడ్డంకులు లేకుండా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం అమలుకు సంబంధించి సంబంధిత కార్మికుల యూనియన్ నాయకులు, కాంట్రాక్టర్లు, ఆర్డబ్ల్యుఎస్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీరామరెడ్డి తాగునీటి పథకం నడిచేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. కార్మికుల యూనియన్ నాయకులు దయచేసి పనికి వచ్చి తాగునీటి పథకంను పునఃప్రారంభం చేయాలన్నారు. తాగునీటి పథకంకు ఏది మంచిది అవుతుందో అది చేద్దామని, సమస్యలు అన్ని అర్థం అయ్యాయని, సమస్యకు శాశ్వత పరిష్కారం అవసరమన్నారు. కార్మికుల జీతం విడుదల చేయిస్తామని, దానిపై తాము శ్రమ పెడుతున్నామన్నారు. జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం కూడా ప్రయత్నం చేస్తుందన్నారు. పథకం మాత్రం ఆగిపోకూడదని, అందుకు ఏం చేయాలో అది చేద్దామన్నారు. పిఎఫ్ కు సంబంధించి వెంటనే ఏం పేమెంట్ చేయగలుగుతారో అది చేయాలని ఆదేశించారు. గతంలో అధికారులతో, కార్మికులతో ఏర్పాటు చేసిన కమిటీని మళ్లీ ప్రారంభించాలన్నారు. కార్మికులు చెప్పిన సలహాలు, సూచనలు విన్నామని, ఖచ్చితంగా వాటి అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కార్మికుల యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసి జీతాలు చెల్లించాలని, పెండింగ్ పిఎఫ్ చెల్లించాలని కోరారు.ఈ సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, ఈఈ మురళీధర్ రావు, డిఈ, సిఐటియు నాయకులు ఓబులు, సంబంధిత కార్మికులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## కీర్తిశేషులు చంద్రశేఖరన్ వైరప్పన్ గారికి ఘన నివాళులు అర్పించిన చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ




తిరుపతి(విజయ సారథి):కరోనా సమయంలో మదనపల్లి ఎన్ఆర్ఐ వాసుల దొమ్మాలపాటి కిషన్ కుమార్ ద్వారా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్నటువంటి సేవలను గుర్తించి ఆనాటి నుండి ప్రతినెల అన్నదాన కార్యక్రమాలతో పాటు విద్యాసామాగ్రి,బెడ్షీట్లు ప్రతి నెలలో వచ్చే పిల్లల పుట్టిన రోజు వేడుకలు ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ సంస్థకు అండగా ఉంటూ మానవత్వానికి మరో రూపం సింగపూర్ వాస్తవ్యులు కీర్తిశేషులు చంద్రశేఖర్ అని కొనియాడిన చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రెటరీ ఏ కవితా రాణి. కీర్తిశేషులు చంద్రశేఖరన్ గారి నివాళు లర్పిస్తూ అన్నదాన కార్యక్రమం మరియు పిల్లలకు పలకలు మరియు ఎక్సంపాడ్స్ ఆనంద వృద్ధాశ్రమం వృద్ధులకు టవల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్వచ్చంద సేవ సంస్థ కోశాధికారి పట్నం గిరిజమ్మాల్, ఆనందవృధాశ్రమం వృద్ధులు, పిల్లలు, సిబంది పాల్గొన్నారు..

## అమరావతి మహిళలను అవమానపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



ఆముదాలవలస(విజయ సారథి): మంగళవారం ఆముదాలవలస నియోజకవర్గంలో అమరావతి రాజధాని, మహిళలపై సాక్షి ఛానల్లో కించపరిచే వ్యాఖ్యలు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళలు నిరసన తెలిపారు.

## 2022-23 ఆర్థిక సంవత్సరం నుండి 2024- 25 ఆర్థిక సంవత్సరం వరకు ఏపిఎస్పిడిసిఎల్, పర్యాటక శాఖ, తిరుపతి స్మార్ట్ సిటీ ల పై సమీక్షా సమావేశం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ



తిరుపతి(విజయ సారథి):మంగళవారం ఉదయం శ్రీ పద్మావతి అతిథి గృహం సమావేశ మందిరంలో ఎ పి ఎస్ పి డి సి ఎల్, పర్యాటక శాఖ మరియు తిరుపతి స్మార్ట్ సిటీ ల పై 2022-23 ఆర్థిక సంవత్సరం నుండి 2024- 25 ఆర్థిక సంవత్సరం వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యులతో తో కలిసి చెర్మన్ కూన రవి కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించి సంబంధిత శాఖాధికారులకు దిశా నిర్దేశం చేసారు. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్. కూన రవి కుమార్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసి, మరింత మెరుగైన విద్యుత్ సేవలను అందించడం ద్వారా వినియోగదారుల సంతృప్త స్థాయిని పెంచాలని అన్నారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కాలిపోయిన సందర్భంలో త్వరితగతన మరో ట్రాన్స్ఫార్మర్ను అమర్చాలనీ తెలిపారు.రోడ్లను ఆనుకుని విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో రోడ్ల విస్తరణకు ఆటంకాలు ఎదురవుతాయని వాటిని అధిగమించేందుకు వీలుగా ముందుగానే విద్యుత్ స్తంభాలను రోడ్డుకు కొద్దిగా దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో ఓవర్ లోడెడ్ ఫీడర్లను గుర్తించి, ఓవర్ లోడ్ సమస్యను అధిగమించేందుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు.వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేయడంలో జాప్యాన్ని అరికట్టాలనీ,రైతులు కోరిన వెంటనే విద్యుత్ సర్వీసును మంజూరు చేయాలని అన్నారు.వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును కచ్చితంగా అమలు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి అని, అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి 9 గంటల విద్యుత్తు సరఫరాను కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.సంస్థ పరిధిలో విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదంలో మనుషులు గానీ లేదా జంతువులు గానీ మరణించినట్లయితే వెంటనే పరిహారాన్ని చెల్లించాలన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం అమలును వేగవంతం చేయాలనీ, ఈ పథకంపై క్షేత్రస్థాయిలో వినియోగదారులకు అవగాహనను మరింత పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.ఏపీ ఎస్పీడీసీఎల్ టోల్ ఫ్రీ నెంబర్ 1912 పై వినియోగదారులకు అవగాహన కలిగించాలని తెలిపారు. కాల్ సెంటర్ ల ద్వారా నమోదైన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అండర్ టెకింగ్స్ కమిటీ వారు తిరుపతి స్మార్ట్ సిటీ కార్యక్రమాలపై సమీక్షించి పురోగతిలో ఉన్న 14 ప్రాజెక్ట్స్ కు నిధుల కొరకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను గుర్తించాలని ఆదేశించినారు. పూర్తయిన ప్రాజెక్టులు మెయింటెనెన్స్ సక్రమంగా చేయాలని సూచించినారు. కమిటీ చైర్మన్ శ్రీ కూన రవికుమార్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమీక్ష సమావేశంలో పదిమంది గౌరవ శాసనసభ మరియు శాసనమండలి సభ్యులు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ మరియు తిరుపతి స్మార్ట్ సిటీ సీఈవో మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి మౌర్య గారు మరియు స్మార్ట్ సిటీ సిబ్బంది పాల్గొన్నారు.- ప్రభుత్వ పబ్లిక్ అండర్టేకింగ్స్ కమిటీ చైర్మన్ శ్రీ కూన రవి కుమార్, మరియు కమిటి సభ్యులు ఈ రోజు ఏపీ టూరిజం అథారిటీ చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించిన కొత్త టూరిజం ప్రాజెక్ట్స్,కొత్తగా రాబోతున్న ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సమీక్ష నందు గడచిన ఫ్లెమింగో ఫెస్టివల్ మరియు టూరిజం కేలండర్ ఫెస్టివల్, జిల్లా రాష్ట్ర స్థాయిలో సాధించిన అవార్డ్ ల గురించి, యోగాంధ్ర, తిరుపతి జిల్లా టూరిజం మాస్టర్ ప్లాన్, స్వర్ణాంధ్ర ప్లాన్ 2024-29, మరియు ఆంధ్రప్రదేశ్ పర్యటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యాటక యూనిట్ల గురించి సమీక్ష నిర్వహించడం జరిగిందని వివరాలను జిల్లా పర్యటక అభివృద్ధి మండలి చైర్మన్ శ్రీ వెంకటేశ్వర్ ఐఏఎస్ శ్రీయుత జిల్లా కలెక్టర్, రీజనల్ డైరెక్టర్ శ్రీ రమణ ప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ సిహెచ్ శ్రీనివాస్ రావు, ఈఈ సుబ్రమణ్యం గారు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ వారు కొత్తగా టూరిజం హబ్ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి ని టూరిజం హబ్ గా తయారు చేయడం కొరకు అనేక ప్రవేటు 5 స్టార్ హోటల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో ఫ్లెమింగో ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించడం ద్వారా అక్కడి ప్రజలను బాగా అకట్టుకోవడం జరిగిందని తెలిపారు. తిరుపతి టూరిజం ద్వారా తిరుపతి పరిసర ప్రాంతాలలో గల దేవాలయాల దర్శనం కోసం ప్రత్యేక ప్యాకేజి ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తద్వారా పర్యాటకులను ప్రజలను ఆకట్టుకునే విధంగా పర్యాటక కేంద్రాలను ఏర్పాటు చేయాలని పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చెర్మన్ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానములు నుండి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, జె ఈ ఓ వీరబ్రహ్మం తదితరులు టీటీడీ నందు భక్తులకు టీటీడీ రోజూ వారి అందిస్తున్న సేవల గురించి పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యులకు వివరించారు తిరుమల తిరుపతి దేవస్థానముల భూములను ఎక్కడ ఎక్కడ ఉన్నాయో గుర్తించి వాటిని దేవస్థానం వారు స్వాధీనం చేసుకోవాలి దెబ్బ తిన్న టీటీడీ కళ్యాణ మండపాలను గుర్తించి వాటిని మరమ్మత్తులు చేసి అందుబాటులోకి తీసుకొని రావాలి అని సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ శాసనసభ్యులు ఆనంద రావు, ఈశ్వర్ రావు, గిడ్డి సత్యనారాయణ, వర్ల కుమార్ రాజ, వి వి కె ప్రసాద్, ఆర్ వి ఎస్ కె కె రంగారావు, శ్రావణ కుమార్, శ్రీమతి శిరీష, శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కుంభ రవి బాబు, ఇషాక్ భాషా, జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకరేశ్వర్, తిరుపతి మునిసిపల్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, ఎ పి ఎస్ పి డి సి ఎల్. సి ఎమ్ డి కె. సంతోష రావు, ఎ పి ఎస్ పిడి సి ఎల్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అయూబ్ ఖాన్, డైరెక్టర్ టెక్నికల్ గురవయ్య, ఎస్ ఈ సురేంద్ర నాయుడు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆర్ డి రమణ ప్రసాద్, తిరుపతి స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా దేశీయోత్పత్తిని వచ్చే ఏడాదికి 50.711 కోట్లకు పెంచేలా బ్యాంకర్లు సహకరించండి

### జిల్లాలో పశు సంపదను అభివృద్ధి చేసేలా ఋణాలు మంజూరు చేయండి

### ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక ప్రోత్సాహం ఇవ్వాలి

### కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు అందించండి


### పిఎం సూర్య ఘర్ పథకం పై పెద్దఎత్తున అవగాహన కల్పించండి

### :జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




నంద్యాల(విజయ సారథి):జిల్లా దేశీయోత్పత్తి 2024-25 కు రూ.43,630 కోట్ల మేరకు సాధించడం జరిగిందని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 కు రూ.50,711 కోట్ల మేరకు పెంచేలా బ్యాంకర్లు సహాయ సహకారాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పై జిల్లా కమ్యూలేటివ్ కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరసింహారావు, ఎల్డిఎం రవీంద్ర కుమార్, పరిశ్రమల శాఖ జిఎం జవహర్ బాబు, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, హార్టికల్చర్ అధికారి నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఏపిఎస్పీడిడిఎల్ ఎస్ఈ సుధాకర్, జిల్లా నైపుణ్య శిక్షణ అధికారి శ్రీకాంత్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, ఆర్బీఐ ప్రతినిధి రామకృష్ణ, లీడ్ బ్యాంకు రీజినల్ అధికారి పి.నరసింహా రావు, నాబార్డు డిడిఎం అన్ని బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి స్థూల దేశీయోత్పత్తిని పెంచడానికి రానున్న ఐదు సంవత్సరాల్లో చేయాల్సిన ప్రణాళికలు రూపొందించడంతో పాటు 2047 నాటికి ప్రతి సంవత్సరం 15 శాతం పెంచడం ద్వారా స్వర్ణాంధ్ర సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. జిల్లా దేశీయోత్పత్తిని 2024-25 కు రూ.43,630 కోట్ల మేరకు సాధించడం జరిగిందని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 కు రూ.50,711 కోట్ల మేరకు పెంచేలా బ్యాంకర్లు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. అదే విధంగా జిల్లాలో ఎక్కువ శాతం తలసరి ఆదాయం ఉన్న మహానంది మండలం ఉందని అన్ని మండలాలు కూడా తలసరి ఆదాయం పెంచేలా కూడా తోడ్పాటును ఇవ్వాలన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలో పశు సంపదను పెద్ద ఎత్తున పెంచడానికి ఒక పశువు ఉన్న వారికి రెండవది, రెండు ఉన్న వారికి మూడవది, మూడు పశువులు ఉన్న వారికి నాలుగు కొనుగోలు చేసేలా బ్యాంకర్లు చేయూత ఇవ్వడం ద్వారా జిల్లాలో పశుసంపద పెరిగే అవకాశం ఉంటుందన్నారు.జిల్లాలో పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పెద్ద ఎత్తున ఋణాలు మంజూరు చేయడం ద్వారా జిల్లా పారిశ్రామికపరంగా పురోగతి సాధించే అవకాశం ఉంటుందన్నారు. కౌలు రైతులకు పెద్దఎత్తున సిసిఆర్సి కార్డులు మంజూరు చేయడం ద్వారా వారికి ఋణ సదుపాయం ఇవ్వడంతో పాటు ఆర్థిక సహాయం అందజేసి అవకాశం ఉంటుందన్నారు.కేంద్ర ప్రభుత్వ పథకాలైన పిఎం సూర్య ఘర్, పిఎం విశ్వకర్మ పథకాలకు బ్యాంకర్లు తప్పనిసరిగా చేయూతను అందజేయాలన్నారు. పిఎం సూర్య ఘర్ ఏర్పాటు చేసుకోవడానికి గాను బ్యాంకర్లు కూడా ఋణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా జిల్లాలో ఇప్పటి వరకు 485 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో వంద శాతం పిఎం సూర్య ఘర్ సోలార్ ఫలకాలు ఏర్పాటు చేయడానికి పాండురంగాపురం గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందుకు సదురు మండలానికి కేంద్ర ప్రభుత్వం నుండి కూడా కోటి రూపాయలు తోడ్పాటు అందజేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా పిఎం విశ్వకర్మకు సంబంధించి సంబంధిత విభాగాల్లో అర్హత ఉన్న వారికి ఋణాలు మంజూరు చేయాలన్నారు.మహానంది మండలంలో సుగంధ అరటి పండ్లు ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారని, అదే విధంగా ఇతర దేశాలకు ఎగుమతి చేసేలా నాబార్డుకు సాకారం అందజేయాలన్నారు. నల్లమల నన్నారి వేర్ల ద్వారా షర్బత్ ను చెంచు వారు శిక్షణ తీసుకొని ఉపాధి పొందుతున్నారని వారికి అవసరమైన చేయూతను ఇవ్వాలన్నారు.అనంతరం 2025-26కు సంబంధించిన వార్షిక క్రెడిట్ ప్లాన్ ను బ్యాంకర్లతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

## బాల కార్మిక వ్యవస్థ ను నిర్మూలిద్దాం నవ సమాజానికి బాటలు వేద్దాం....!!!



తిరుపతి(విజయ సారథి):బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు – కంభం వారి పల్లి మండలం మండలంలో విస్తృత సోదాలుచిత్తూరు, జూన్ 10, 2025: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా జూన్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు (జూన్ 10, 2025) కంభం వారి పల్లి మండలకేంద్రం గర్ని మిట్ట లో పలు దుకాణాలు వెల్డింగ్ షాపులు మరియు చికెన్ సెంటర్లు పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ సిబ్బందితోపాటు, గ్రేట్ విజన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం బాబు . విద్య, వైద్య, పోలీసు, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ఈ కార్యాచరణను నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం రెడ్డి,వైద్య శాఖ సిబ్బంది పురుషోత్తం,వెంకటరత్న, పోలీసు సిబ్బంది రమేష్ బాబు, వెంకటరమణ, శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ అన్నపూర్ణ మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ పారా లీగల్ వాలంటీర్ గట్టప్ప తో పాటు రెడ్స్ సిబ్బంది వెంకటయ్య మరియు వర్తక వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వరిరైతుకు కలసిరాని కాలం

### అకాల వర్షాలకు తోడు..సర్కార్ నిర్లక్ష్యం

గుంటూరు,జూన్10: వరి రైతుకు ఈ ఏడాది కాలం కలిసి రాలేదు. తెగుళ్ళు, అధిక వర్షాలు, ఎలుకలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. మరోవైపు మద్దతు ధర లభించే పరిస్థితి కానరావడం లేదు. వర్షం.. తెగుళ్లు.. ఎలుకలు.. ఇలా ధాన్యం రైతును దెబ్బతీశాయి. ఆరుగాలం కష్టించి సాగు చేసినా ఆశించిన దిగుబడులు రాక అన్నదాత అల్లాడుతున్నాడు. సాగు కష్టాలను అధిగమించి పండించిన ధాన్యానికి మార్కెట్లో మద్దతు గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆర్బీకేలో ధాన్యం కోనుగోళ్లకు ఏర్పాట్లు చేసినా శాంపిల్స్ స్థాయిలోనే ఉన్నాయి.నిబంధనలు పరిశీలిస్తే ధాన్యం విక్రయించుకునే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. యంత్రాలతో నూర్పిళ్లు చేస్తున్నందున తేమ ఉంటుందన్నారు. అయితే 17 శాతం లోపే తేమ ఉండాలని మార్కెటంగ్ శాఖ షరతులు విధిస్తున్నది. దీనికి తోడు ట్రాన్స్ఫోర్టు ఖర్చులు, కాటా కూలి కలిపితే బస్తాకు వందకుపైగా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. షరతులు సడలించాలని, తేమను పరిగణనలోకి తీసుకోకుండా కోనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. బహిరంగ మార్కెట్లో కూడా మద్దతు ధర అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు ఎకరాకు 5 నుంచి 10 బస్తాల వరకు దిగుబడులు తగ్గాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు మార్కెట్లో ధాన్యం ధర పతనమైంది. ఒకవైపు దిగుబడులు తగ్గడం.. మరోవైపు ధర పతనంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారు. ఆర్బీకేల ద్వారా రైతుల నుంచి ధాన్యం కోనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందే కాని క్షేత్రస్థాయిలో చర్యలు లేవు. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఏటా 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడులు ఉండేవని ఈ ఏడాది పది బస్తాల వరకు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.30 వేల నుంచి 37 వేల వరకు సాగు వ్యయమైందని.. ఈ పరిస్థితుల్లో అప్పులే మిగిలాయని వాపోతున్నారు. ఆర్బీకేలలో ఇంకా పూర్తి స్థాయిలో కోనుగోలు చేయడంలేదు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com